# తొలి అక్షరం

తెలుగు దిన పత్రిక

చైర్మెన్ & చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు

ఎడిటర్: పి.సైదులు, సంపుటి : 02 సంచిక - 48 పేజీలు - 6 శనివారం 11 జనవరి 2025


## హోటల్ గదిలో ప్రేమజంట బలవన్మరణం

**- పెళ్లికి అంగీకరించలేదని..ఉరేసుకుని మృతి**

**తొలి అక్షరం/సంగారెడ్డి,జనవరి10:** సింగూరు ప్రాజెక్టు సమీపంలో ప్రేమజంట ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మునిపల్లి మండలం బుసారెడ్డిపల్లి వద్ద హరిత రెస్టారంట్‌లో గురువారం మధ్యాహ్నం ప్రేమ జంట గదిని అద్దెకు తీసుకుంది. శుక్రవారం గది ఖాళీ చేయాల్సి ఉండగా వారు బయటకు రాకపోవడంతో సిబ్బంది కిటికీలు బద్దలుకొట్టి చూడగా.. ఫ్యాన్‌కు ఉరేసుకొని ఉన్నారు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని వారి తల్లిదండ్రులకు సమాచారమందించారు. మృతులను నారాయణఖేడ్ మండలం నారాయణపేట గ్రామానికి చెందిన ఉదయ్ (20), అదే గ్రామానికి చెందిన యువతిగా గుర్తించారు. ఇరువురి కులాలు వేరు కావడంతో పెళ్లికి పెద్దలు అంగీకరించలేదని, ఆ మనస్తాపంతోనే ఇద్దరూ ఆత్మహత్య చేసుకున్నట్టు పోలీసులు అనుమానిస్తున్నారు.



- కాలుష్య కారక వాహనాలకు అవుటర్ రింగ్‌రోడ్‌కు
- స్వయం సహాయక సంఘాల్లో 67 లక్షల మంది మహిళలు
- వారు క్యాంటీన్లు ఏర్పాటు చేసుకుందుకు చర్యలు
- విద్యార్థులకు 40 శాతం డైట్, 200 శాతం కాస్మోటిక్ ఛార్జీలను పెంచాం
- సీఐఐ జాతీయ కౌన్సిల్ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి

# చంద్ర మండలానికి వెళ్లిన భూమ్మీద ఎలా ఉండాలో తెలియటం లేదు

**తొలి అక్షరం/హైదరాబాద్,జనవరి 10 :** హైదరాబాద్‌ను కాలుష్య రహిత నగరంగా మార్చేందుకు ప్రయత్నిస్తున్నామని, చంద్రమండలానికి వెళ్తున్నాం.. కానీ భూమిపైన ఎలా ఉండాలో మాత్రం తెలుసుకోలేకపోతున్నామని అన్నారు. సీఐఐ జాతీయ కౌన్సిల్ సమావేశం శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐఐ ప్రతినిధులతో ముఖ్యమంత్రి ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. కాలుష్య కారక వాహనాలను అవుటర్ రింగ్ రోడ్డు అవతలికి తరలిస్తున్నామన్నారు. తెలంగాణలో స్వయం సహాయక సంఘాల్లో 67 లక్షల మంది మహిళలు సభ్యులుగా ఉన్నారని, ప్రభుత్వ కార్యాలయాల్లో స్వయం సహాయక మహిళా సంఘాలతో క్యాంటీన్లు ఏర్పాటు చేయించామన్నారు. మహిళా సంఘాలతో సోలార్ పవర్ స్టేషన్లు ఏర్పాటు చేయిస్తున్నామన్నారు. వెయ్యి మెగావాట్ల సోలార్ పవర్ ఉత్పత్తి చేసేలా మహిళా సంఘాలను ప్రోత్సహిస్తున్నామని, హైటెక్ సిటీ పక్కనే మహిళా సంఘాల ఉత్పత్తులను విక్రయించుకు నేందుకు మూడున్నర ఎకరాల స్థలంలో స్టాల్స్ ఏర్పా టు చేశామని చెప్పారు. ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో చదువుకునే విద్యార్థులకు 40 శాతం డైట్ చార్జీలు, 200 శాతం కాస్మొటిక్ ఛార్జీలను పెంచామని సీఎం రేవంత్ రెడ్డి

వివరాలు 2లో

# రాష్ట్రాలకు పన్నుల వాటా విడుదల

- తెలంగాణకు రూ.3,637 , ఆంధ్రప్రదేశ్‌కు రూ.7,002 కోట్లు




**తొలి అక్షరం/న్యూఢిల్లీ,జనవరి 10:** దేశంలోని వివిధ రాష్ట్రాలకు కేంద్రం శుభవార్త చెప్పింది. పన్నుల్లో వాటా కింద తెలంగాణతో పాటు పలు రాష్ట్రాలకు నిధులను విడుదల చపేసింది. దేశంలోని 28 రాష్ట్రాలు/యూటీలకు కలిపి జనవరి నెలకు మొత్తం రూ.1,73,030 కోట్లు

వివరాలు 2లో

# హరీష్ అరెస్ట్ విషయంలో హైకోర్టు ఆదేశం

**- మధ్యంతర ఉత్తర్వులు పొడిగింపు**



**తొలి అక్షరం/హైదరాబాద్,జనవరి 10 :** ఫోన్ ట్యాపింగ్ కేసులో హరీశ్‌రావును అరెస్టు చేయవద్దన్న మధ్యంతర ఉత్తర్వులను హైకోర్టును పొడిగించింది. రియల్ ఎస్టేట్ వ్యాపారి గాదగోని చక్రధర్ గౌడ్ ఫిర్యాదు మేరకు నమోదైన కేసుపై తాజాగా హైకోర్టు విచారణ చేపట్టింది. కౌంటర్ దాఖలు చేయాలని చక్రధర్ గౌడ్‌కు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను ఈ నెల 28వ తేదీకి వాయిదా వేసింది. అప్పటివరకు హరీశ్‌రావును అరెస్టు చేయవద్దనే ఉత్తర్వులను పొడిగించింది. హరీశ్‌రావు మంత్రిగా ఉన్న సమయంలో తన ఫోన్ ట్యాపింగ్ చేశారని, తనపై బెదిరింపులకు పాల్పడ్డారని గత నెల 1వ తేదీన సిద్దిపేటకు చెందిన రియల్‌ఎస్టేట్ వ్యాపారి, కాంగ్రెస్ నేత గాదగోని చక్రధర్ గౌడ్ పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో హరీశ్‌రావుపై కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో తనపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను రద్దు చేయాలని, తనను అరెస్టు చేయకుండా ఆదేశాలివ్వాలని హరీశ్‌రావు అప్పట్లో హైకోర్టును ఆశ్రయించారు. హరీశ్‌రావు పిటిషన్‌పై గతంలో విచారణ చేపట్టిన హైకోర్టు.. ఆయన్ను అరెస్టు చేయరాదని పోలీసులను ఆదేశించింది. హరీశ్ రావుపై ఎటువంటి కఠిన చర్యలు తీసుకోరాదని కూడా పంజాగుట్ట పోలీసులకు మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. హరీశ్‌పై పోలీసులకు ఫిర్యాదు చేసిన చక్రధర్‌గౌడ్‌కు నోటీసులు జారీచేసింది. పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని ఆయనను ఆదేశించింది.

# కాంగ్రెస్, బిఆర్ఎస్ రెండూ ఒక్కటే

- ఫార్ములా రేస్ కేసులో నిధులు ఎందుకు బదలాయించారు
- 700 కోట్లు ఎ క్కడ లాభాలు వచ్చాయో కెటిఆర్ చెప్పగలడా
- కేంద్రమంత్రి బండి సంజయ్ ఘాటు విమర్శలు



**తొలి అక్షరం/కరీంనగర్,జనవరి10:** ఫార్ములా ఈ కార్ రేస్ కేసులో కేటీఆర్ అరెస్ట్ అయితే ఆందోళనలు ఎందుకు చేయాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు. కేటీఆర్ ఏమైనా స్వాతంత్ర్య సమరయోధుడా అని ప్రశ్నించారు. అందుకోసం ఏమైనా జైలుకు వెళతారా అని నిలదీస్తూ.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై కేంద్ర మంత్రి బండి సంజయ్ ఫైర్ అయ్యారు. శుక్రవారం ఆయన కరీంనగర్‌లో మీడియాతో మాట్లాడుతూ.. సర్కార్ సొమ్మును అక్రమంగా కట్టబెట్టి పైగా అడ్డగోలుగా మాట్లాడతవా అని కేటీఆర్ పై సీరియస్ అయ్యారు. కేబినెట్ ఆమోదం

వివరాలు 2లో



# నేటి నుంచి సంక్రాంతి సెలవులు

**- మళ్లీ 18వ తేదీన తెరుచుకోనున్న బడి తలుపులు**

**తొలి అక్షరం/హైదరాబాద్,జనవరి 10 :** తెలంగాణలో సంక్రాంతి పండుగ హడావుడి మొదలైంది. ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో శుక్రవారం ఘనంగా సంక్రాంతి వేడుకలను నిర్వహించారు. ఎందుకంటే రేపట్నుంచి స్కూళ్లకు సంక్రాంతి సెలవులు కాబట్టి. స్కూల్ విద్యార్థులు

వివరాలు 2లో

# ఎమ్మెల్సీ ఎన్నికలకు బిజెపి అభ్యర్థుల ప్రకటన

- గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా అంజిరెడ్డి
- టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా మల్క కొమురయ్య
- మరో అభ్యర్థిగా సర్వోత్తం రెడ్డిల పేర్లు వెల్లడి



**తొలి అక్షరం/హైదరాబాద్,జనవరి 10 :** తెలంగాణలో జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికలకు బీజేపీ అభ్యర్థులను ప్రకటించింది. అందరి కంటే ముందుగానే మూడు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించి ప్రత్యర్థి పార్టీలకు బీజేపీ షాక్ ఇచ్చింది. రాష్ట్రంలో రెండు టీచర్, ఒక గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఎన్నికల సంఘం ప్రకటన జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు నిజామాబాద్- ఆదిలాబాద్- కరీంనగర్- మెదక్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా అంజిరెడ్డి పేరును బీజేపీ ఖరారు చేసింది. నిజామాబాద్ -అదిలాబాద్- కరీంనగర్- మెదక్-టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా మల్క కోమరయ్య పేరును

వివరాలు 2లో

# తెలుగు రాష్ట్రాల్లో ఘనంగా వైకుంఠద్వార దర్శనం

- వైష్ణవాలయాలకు పోటెత్తిన భక్తజనం
- యాదాద్రి, భద్రాద్రి, ధర్మపురిల్లో ఉత్తర ద్వారదర్శనం

**తొలి అక్షరం/హైదరాబాద్,జనవరి 10 :** వైకుంఠ ఏకాదశి వేడుకలు తెలుగు రాష్ట్రాల్లో ఘనంగా ప్రారంభమయ్యాయి. గురువారం రాత్రి నుంచి పలు వైష్ణవాలయాలకు భక్తులు భారీ ఎత్తున తరలివచ్చారు. ఆలయాలను తెరచి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు ఉత్తరద్వార దర్శనం కల్పించారు. విష్ణువును దర్శించుకుంటే వైకుంఠం ప్రాప్తిస్తుందని భక్తుల నమ్మకం. దీంతో ఈ పుణ్య రోజున భక్తులు లక్షలాదిగా వైష్ణవాలయాలకు తరలివస్తారు. తిరుమలలో స్వామివారికి ఏకాంతంగా కైంకర్యాలు, అభిషేకాలు నిర్వహించిన అనంతరం 4.30 గంటల నుంచి భక్తులకు దర్శనం కల్పించారు.భద్రాచలంలో సరిగ్గా ఉదయం 5 గంటలకు భక్తులకు సీతారామచంద్ర స్వామివారి దర్శన భాగ్యం కల్పించారు. స్వామి సేవలో తరించేందుకు భక్తులు భారీ ఎత్తున తరలివచ్చారు. యాదగిరిగుట్టలో స్వామి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. గరుడ వాహనంపై వాసుదేవుడి రూపంలో స్వామివారు ఉత్తర ద్వార దర్శనం ఇవ్వనున్నారు. ఇవాళ స్వామివారికి గరుడ సేవోత్సవం, తిరువీధి సేవ నిర్వహించనున్నారు. ధర్మపురి నరసింహస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు.గోదావరిలో స్నానాలు ఆచరించిన భక్తులు



స్వామిని దర్శించుకున్నారు. జంటన గరాల్లో పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. హిమాయత్ నగర్, జూబ్లీహిల్స్ వెంకటేశ్వరాలయాలు, బంజారాహిల్స్ వేంకటేశ్వరాలయం, చిక్కడపల్లి, పెద్దమ్మగుడి, నానాక్‌రామ్ గూడ, ఓల్డ్ సిటీ రంగనాథ స్వామి ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భజనలు చేసారు. వేకవ జామునుంచే ఆలయాలను దర్శించుకుని వైకుంఠద్వార దర్శనం చేసుకున్నారు. చిలుకూరు ఆలయానికి కూడా భక్తులు భారీగా తరలివచ్చారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



# రూ.168 కోట్లతో నేతన్నలకు అభయహస్తం పథకం

**తొలి అక్షరం/హైదరాబాద్,జనవరి 10 :** రాష్ట్రంలోని చేనేత, మరమగ్గాల కార్మికుల సంక్షేమం, వారి సమగ్ర అభివృద్ధి కోసం రూ.168 కోట్లతో చేనేత అభయహస్త పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తుందని వ్యవసాయం, చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. చేనేత కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ పథకాన్ని ఆమోదించినందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మంత్రి తుమ్మల ధన్యవాదాలు తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వ చిత్తశుద్ధికి ఇదొక నిదర్శనమని ఆయన అన్నారు.ఈ పథకం ద్వారా తెలంగాణ నేతన్న పొదుపు (పొదుపు నిధి), తెలంగాణ నేతన్న భద్రత (నేతన్న భీమా), తెలంగాణ నేతన్నకు భరోసాలు అమలు చేయడం జరుగుతుందని, నేతన్న పొదుపు కోసం బడ్జెట్ ద్వారా రూ.115 కోట్లు, నేతన్న భద్రత కోసం రూ. 9 కోట్లు, నేతన్న భరోసా పథకానికి రూ. 44 కోట్లు కేటాయింపులు జరిపినట్లు మంత్రి వివరించారు.

వివరాలు 2లో

## రాష్ట్రాలకు పన్నుల వాటా విడుదల

(మొదటి పేజీ తరువాయి)

విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో తెలంగాణకు రూ.3,637 కోట్లు, ఆంధ్రప్రదేశ్‌కు రూ.7,002 కోట్లు ఇచ్చింది. మూలధన వ్యయం, అభివృద్ధి, సంక్షేమానికి నిధులు విడుదల చేస్తున్నట్లు పేర్కొంది. కాగా.. గత నెల(డిసెంబర్)లో రూ. 89,086 కోట్లను పన్నుల్లో వాటా కింద రాష్ట్రాలకు పంపిణీ చేసిన సంగతి తెలిసిందే.

## కాంగ్రెస్, బిఆర్ఎస్ రెండూ ఒక్కటే

(మొదటి పేజీ తరువాయి)

లేకుండా విదేశీ కంపెనీకి అంత అర్జెంట్‌గా 55 కోట్లు విడుదల చేయాల్సిన అవసరం ఏముందని నిలదీశారు. ఫార్ములా ఈ రేస్ తో ప్రభుత్వానికి రూ.700 కోట్లు లాభం వచ్చిందని కేటీఆర్ అంటున్నారు.. మరీ ఆ లాభాలు ఎక్కడ వచ్చాయో చూపించాలని డిమాండ్ చేశారు. లొట్టపీసు సీఎం, లొట్ట పీసు ప్రభుత్వం అని కేటీఆర్ నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నా.. సీఎం రేవంత్ రెడ్డి ఎందుకు మౌనంగా ఉంటున్నారు..? ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. రేవంత్‌ను అడ్డగోలుగా తిడుతున్నా పట్టించుకోకపోవడం వెనుక ఆంతర్యమేంటని అన్నారు. ఢిల్లీ వెళ్లి కేసీఆర్ కాంగ్రెస్ హైకమాండ్‌కు కప్పం కడుతున్నందుకే రేవంత్ ఏం చేయలేక పోతున్నారా.. అని నిలదీశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య చీకటి ఒప్పందం ఉందని.. ఆ రెండు పార్టీలు ఒక్కటేనని విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ డ్రామాలపై, కేసీఆర్ కుటుంబ అవినీతిపై బీజేపీ రాజీలేని పోరు కొనసాగిస్తోందని ఈ సందర్భంగా బండి సంజయ్ స్పష్టం చేశారు.

## నేటి నుంచి సంక్రాంతి సెలవులు

(మొదటి పేజీ తరువాయి)

సంప్రదాయ దుస్తుల్లో ముస్తాబై పాఠశాలలకు వెళ్లారు. రాష్ట్రంలోని అన్ని రకాల పాఠశాలలకు జనవరి 11 నుంచి 17 వరకు సంక్రాంతి సెలవులు ప్రకటించారు. 18వ తేదీన పాఠశాలలు తిరిగి తెరుచుకోనున్నాయి. ఇక జూనియర్ కాలేజీలకు జనవరి 11 నుంచి 16 వరకు సెలవులు ప్రకటించారు. 17న పునఃప్రారంభం కానున్నాయి. సెలవు దినాల్లో ఎట్టి పరిస్థితుల్లో కూడా తరగతులు నిర్వహించకూడదని ఇంటర్మీడియట్ బోర్డు ప్రయివేటు కాలేజీల యాజమాన్యాలను హెచ్చరించింది. ఇంటర్ బోర్డు నిబంధనలు ఉల్లంఘించిన కాలేజీలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

## ఎమ్మెల్సీ ఎన్నికలకు బిజెపి అభ్యర్థుల ప్రకటన

(మొదటి పేజీ తరువాయి)

ప్రకటించింది. అలాగే వరంగల్- ఖమ్మం-నల్గొండ టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా సర్వోత్తం రెడ్డిని కాషాయం పార్టీ ప్రకటించింది. అన్ని ప్రధాన పార్టీల కంటే ముందే తమ అభ్యర్థులను ప్రకటించిన బీజేపీ.. ప్రచారంలోనూ దూకుడు పెంచేలా కసరత్తు చేస్తోంది. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో మెరుగైన స్థానాలు సాధించడంతో ఎమ్మెల్సీ ఎన్నికలపైనా ప్రస్తుతం ఫోకస్ పెట్టింది. ముందుగానే అభ్యర్థులను ప్రకటించి ప్రజల దృష్టిని ఆకర్షించేలా చేస్తోంది. ఈ మూడు స్థానాలను సైతం కైవసం చేసుకునే దిశగా పావులు కదుపుతోంది.

## కెసిఆర్‌తో కెటిఆర్ భేటీ



**తొలి అక్షరం/హైదరాబాద్,జనవరి 10 :** ఫార్ములా- ఈ కార్ రేస్ కేసు నేపథ్యంలో మాజీ ముఖ్యమంత్రి, బిఆర్ఎస్ అధినేత కెసిఆర్‌ను ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ భేటీ అయ్యారు. సిద్దిపేట జిల్లా ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో శుక్రవారం కెటిఆర్‌తోపాటు మాజీ మంత్రి హరీష్‌రావు, బీఆర్ఎస్ నేతలు బాల్క సుమన్, పాడి కౌశిక్ రెడ్డిలు కెసిఆర్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గురువారం జరిగిన ఎసిబి విచారణకు సంబంధించిన పలు అంశాలను కెసిఆర్ దృష్టికి కెసిఆర్ తీసుకువెళ్లారు. ఎసిబి విచారణలో అధికారులు అడిగిన ప్రశ్నలు, తాను చెప్పిన సమాధానాలను వివరించారు. అలాగే ఈనెల 16వ తేదీన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్(ఇడి) విచారణకు హాజరుకావాల్సి ఉందని కెసిఆర్‌కు కెటిఆర్ తెలిపారు. దీంతో ఈనెల 16న ఇడి విచారణను ఎలా ఎదుర్కోవాలనే అంశంపై కెటిఆర్‌కు అధినేత దిశానిర్దేశం చేశారు. దాదాపు గంటన్నరపాటు జరిగిన సమావేశంలో తెలంగాణ తాజా రాజకీయ పరిణామాలు, కేసులతోపాటు పార్టీ పరంగా తీసుకోవాల్సిన అంశాలపైనా నేతలకు కెసిఆర్ సూచనలు చేశారు.

**1+6 ఆఫర్ సీఎం వ్యవస్థను ఎప్పుడూ చూడలేదెమో : కెటిఆర్ సెటైర్లు**

తెలంగాణలో ఒక ముఖ్యమంత్రిని ఎన్నుకుంటే.. ఇంకో అర డజన్ మంది ఫ్రీగా వచ్చారని, ఇది తెలంగాణ రాష్ట్ర ప్రజల అదృష్టం అని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ పేర్కొన్నారు. 1౦6 ఆఫర్ సీఎం వ్యవస్థని స్వతంత్ర భారత చరిత్రలో ఎప్పుడు చూడలేదెమో అని కెటిఆర్ ఎక్స్ వేదికగా సెటైర్లు వేశారు. వికారాబాద్ సిఎం తిరుపతి రెడ్డికి ఇవే నా హృదయపూర్వక శుభాకాంక్షలు అని విమర్శించారు. ప్రజా పాలన కాబట్టి ప్రజలకి మీ అనుముల సిఎంలలో ఎవరు కావాలో ఎంచుకునే అవకాశం ఇవ్వాలని కోరుకుంటునని అన్నారు. సిఎం ఎంపిక కోసం ఐవీఆర్ఎస్ పద్ధతి పెడితే బాగుంటుందేమో చూడండి అని రేవంత్ రెడ్డికి ఒక చిన్న విన్నపం చేస్తున్నట్లు కెటిఆర్ సూచించారు.

## చంద్ర మండలానికి వెళ్లిన భూమ్మీద ఎలా ఉండాలో తెలియటం లేదు

(మొదటి పేజీ తరువాయి)

తెలిపారు. రాష్ట్రంలో మహిళాభివృద్ధి ధ్యేయంగా అడుగులు వేస్తున్నామని, కోటి మంది మహిళలను కోటీశ్వ రులను చేయడమే ధ్యేయంగా ముందుకు వెళుతున్నా మని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. గ్రామీణ మహిళల సాధికారత కోసం ప్రత్యేక దృష్టి సారిస్తు న్నామన్నారు. తెలంగాణలో ఆటో మొబైల్ రంగంపై ప్రత్యేక దృష్టి సారించామని, మచిలీపట్నం పోర్ట్‌ను అనుసంధానం చేస్తు రోడ్లు రైలు మార్గాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. రీజనల్ రింగ్ రైల్వే లైన్ మంజూరు చేయాలని ప్రధాని మోదీని కోరామని చెప్పారు. చైనా తరహాలో క్లస్టర్లు ఏర్పాటు చేస్తామని, అవుటర్ రింగ్ రోడ్డు, రీజనల్ రింగ్ రోడ్డు మధ్య రేడియల్ రోడ్లు నిర్మిస్తామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. తెలంగాణలో ప్రతి యేడాది లక్షా పదివేల మంది ఇంజనీరింగ్ విద్యార్థులు ఉత్తీర్ణత సాధిస్తున్నారన్నారు. ఎక్కువ మంది విద్యార్థుల్లో స్కిల్ ఉండటం లేదని, టాటా గ్రూప్‌తో కలిసి 2400 కోట్లతో రాష్ట్రంలోని ఐటీఐలను ఐటీసీలుగా మారుస్తున్నామన్నారు. నైపుణ్యాల పెంపు కోసం ప్రత్యేకంగా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నామని, ఐఎస్ బీ తరహాలో స్కిల్ యూనివర్సిటీ కోసం ఆనంద్ మహీంద్రా చైర్మన్‌గా బోర్డు ఏర్పాటు చేశామని తెలిపారు. స్కిల్ యూనివర్సిటీ కార్పస్ ఫండ్ కోసం సీఐఐ ప్రతినిధులు మద్దతు ఇవ్వాలని, స్పోర్ట్స్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ హబ్ కూడా ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. సీఐఐ ప్రతినిధులు ఎప్పుడైనా వచ్చి తనను కలవచ్చు.. తమ ప్రభుత్వం అన్ని రకాలుగా సహకరిస్తుందని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కాగా హైదరాబాద్‌లో ఫోర్త్ సిటీ, ఫ్యూచర్ సిటీని నిర్మించాలని నిర్ణయించుకున్నామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. ప్రపంచంలో హైదరాబాద్‌ను చైనాకు ప్లస్ సిటీగా మార్చే వ్యూహంతో ముందుకు వెళ్తున్నామని అన్నారు. న్యూయార్క్, లండన్, టోక్యో, సియోల్ , దుబాయ్ వంటి నగరాలతో ఫ్యూచర్ సిటీ పోటీ పడుతుందని వివరించారు. భారతదేశంలోనే గొప్ప నగరాన్ని నిర్మించాలని అనుకుంటున్నాం.. ఇందులో సేవారంగం మాత్రమే ఉంటుందని అన్నారు. ఎలక్ట్రిక్ వాహనాలకు రిజిస్ట్రేషన్, రోడ్డు పన్నును తొలగించామని ప్రకటించారు. ఫ్యూచర్ సిటీ కాలుష్య రహిత నెట్ జీరో సిటీగా చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. 3,200 ఈవీ బస్సులను ఆర్టీసీలోకి తీసుకువస్తున్నామని అన్నారు. భారతదేశంలోనే ఎలక్ట్రిక్ వాహనాలు అత్యంత వేగంగా తెలంగాణలో అమ్ముడవుతున్నాయని ముఖ్యమంత్రి వివరించారు.

# 26 నుంచి రైతు భరోసా, 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా'

- సాగుయోగ్యమైన భూమికి మాత్రమే రైతుభరోసా
- అనర్హులకు పథకాలు అందకుండా చూడాలి
- ప్రభుత్వ పథకాలకు పూర్తి బాధ్యత మీదే
- ప్రజల్లోకి వాటిని సక్రమంగా తీసుకు వెళ్లాలి
- గ్రామసభలు నిర్వహించి పక్కగా అమలు చేయాలి
- అభివృద్ధి,సంక్షేమం మాకు రెండు కళ్లు
- కలెక్టర్ల సదస్సులో సిఎం రేవంత్ స్పష్టమైన ఆదేశాలు



**తొలి అక్షరం/హైదరాబాద్,జనవరి 10 :** ఈనెల 26 నుంచి రైతుభరోసా, 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా' పథకాలు అమలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. పథకాలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని అమలు చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. నాలుగు పథకాల అమలుపై రాష్ట్ర వ్యాప్తంగా గ్రామాల్లో గ్రామసభలు, మున్సిపాలిటీల్లో వార్డు సభలు నిర్వహించాలని.. అందుకు తీసుకోవాల్సిన చర్యలపై సీఎం కలెక్టర్లకు దిశానిర్దేశర చేశారు. ఈ మేరకు కలెక్టర్లతో జరుగుతోన్న సమావేశంలో సీఎం పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. 'ఈ నెల 26 తర్వాత జిల్లాల్లో పర్యటిస్తాను. అన్ని జిల్లాలో ఆకస్మిక తనిఖీలు చేస్తా. సాగు యోగ్యమైన ప్రతి ఎకరాకు రైతు భరోసా చెల్లించాలి. పంట వేసినా.. వేయకపోయినా.. సాగుయోగ్యమైన భూమికి రైతు భరోసా ఇవ్వాలి. అనర్హులకు ఇవ్వొద్దు. ఇందుకోసం క్షేత్రస్థాయిలో పర్యటించి అనర్హులను గుర్తించాలన్నారు.. సాగు యోగ్యం కాని భూములను గుర్తించి మినహాయించాలి. స్థిరాస్తి భూములు, లేఅవుట్లు, నాలా కన్వర్షన్, మైనింగ్, గోదాములు నిర్మిoచిన భూములు, వివిధ ప్రాజెక్టులకు సేకరించిన భూముల వివరాలను సేకరించాలి. గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీల రెవెన్యూ రికార్డులను క్రోడీకరించుకోవాలి. గ్రామాల మ్యాప్‌లను పరిశీలించి క్షేత్రస్థాయిలో ధ్రువీకరించుకోవాలి. వాటిపై గ్రామ సభల్లో చర్చించి నిర్ణయం తీసుకోవాలి. ఈ విషయంలో ఎలాంటి అనుమానాలకు తావు లేదని సీఎం వివరించారు. ఈ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లుగా భావిస్తోందని.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావించిన కులగణన సర్వే 96 శాతం పూర్తి చేసినందుకు జిల్లా కలెక్టర్లకు అభినందనలు తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేది కలెక్టర్లేనని అన్నారు. కలెక్టర్ల పనితీరే ప్రభుత్వ పనితీరుకు కొలమానం అని తెలిపారు. కలెక్టర్లు తమ పనితీరును మరింత మెరుగుపరుచుకుని ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందని సీఎం సూచించారు. క్షేత్రస్థాయి పర్యటనలు చేయాలని గతంలోనే ఆదేశాలు ఇచ్చాం.. కానీ కొంతమంది ఇంకా ఆఫీసులలో కూర్చునే పనిచేయాలని భావిస్తున్నారని కలెక్టర్లకు సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. సమస్యలు వచ్చినప్పుడు సమర్ధవంతంగా ఎదుర్కోవాల్సిన అవసరం ఉంది.. మీ పని తీరును మరింత మెరుగుపరుచుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. మరోవైపు.. వ్యవసాయ యోగ్యం కాని భూములకు కూడా గతంలో రైతు పెట్టుబడి సాయం అందించారు.. అనర్హులకు రైతు భరోసా ఇవ్వొద్దని పేర్కొన్నారు. క్షేత్ర స్థాయిలో వెళ్లి అనర్హులను గుర్తించాల్సిందే.. భూమి లేని వ్యవసాయ కూలీ కుటుంబాలకు మాత్రమే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అందించాలన్నారు. రాష్ట్రంలో వన్ రేషన్ వన్ స్టేట్ విధానాన్ని తీసుకురాబోతున్నాం.. తెలంగాణలో ఒకరికి ఒకచోట మాత్రమే రేషన్ కార్డు ఉండాలని సీఎం కలెక్టర్లకు చెప్పారు. ఈ నెల 11 నుంచి 15 లోగా పథకాల అమలుకు కావాల్సిన ప్రిపరేటరీ వర్క్ పూర్తి చేయాలని తెలిపారు. కలెక్టర్లు అర్హుల జాబితాను ఇంఛార్జి మినిస్టర్ కు అందించాలని సీఎం చెప్పారు. ఇంఛార్జ్ మినిస్టర్ ఆమోదంతోనే కలెక్టర్లు అర్హుల జాబితాను విడుదల చేయాలన్నారు. జనవరి 26న అత్యంత ప్రతిష్టాత్మక పథకాలను అమలు చేయబోతున్నాం.. ఇందుకు సంబంధించి పకడ్బందీగా ఏర్పాట్లు చేసుకోవాలని కలెక్టర్లకు సూచించారు. ప్రభుత్వం పేదల కోసం పనిచేస్తుందని, గొప్పగా పనిచేస్తున్నదన్న నమ్మకం ప్రజలకు కలిగించాలన్నారు. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు నెలలో ఒక్కసారైనా హాస్టల్స్ విజిట్ చేసి రాత్రి బస చేయాలని తెలిపారు. మహిళా అధికారులు బాలికల హాస్టల్స్‌కు వెళ్లి అక్కడి విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపండని చెప్పారు. సంక్షేమ ఫలాలు క్షేత్రస్థాయికి చేరేలా చర్యలు తీసుకోండి.. జనవరి 26 తరువాత తాను ఆకస్మిక తనిఖీలు చేస్తానని అన్నారు. నిర్లక్ష్యం కనిపిస్తే కఠిన చర్యలు తప్పవని ముఖ్యమంత్రి కలెక్టర్లను హెచ్చరించారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నాలుగు ప్రధాన పథకాలను ఈనెల 26వ తేదీ నుండి అమలుచేయాలని నిర్ణయించామన్నారు. భారీ వ్యయంతో కూడుకున్నప్పటికీ.. రాష్ట్రంలోని పేదలకు మేలు చేయాలన్న భావనతో విస్తృతంగా చర్చించిన మీదటే.. ఈ పథకాలను అమలు చేయాలనే నిర్ణయం తీసుకున్నామని డిప్యూటీ సీఎం తెలిపారు. ఇప్పటికే.. ప్రతీ గ్రామంలో ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేశామని.. ఈ పథకాల అమలులో ఇందిరమ్మ కమిటీల భాగస్వామ్యం తీసుకోవాలని సూచించారు. లబ్దిదారుల ఎంపికను, ప్రతీ ఉమ్మడి జిల్లాలో ఇంఛార్జి మంత్రులు ఇందిరమ్మ కమిటీలతో చర్చించిన మీదటే చేపట్టాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ప్రస్తుతం నిర్ణయించే రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుల వివరాలను ప్రతీ గ్రామంలో ఫ్లెక్సీల ద్వారా ప్రకటించాలని అన్నారు. ఇప్పటికే, రాష్ట్రంలో రూ.22000 కోట్ల రైతు రుణ మాఫీలను చేశాం.. ఈ వివరాలను కూడా ప్రతీ గ్రామంలో ప్రకటించాలని తెలిపారు. ఈ నాలుగు పథకాలను సంబంధించి సవివరమైన మార్గ దర్శకులతో ఉత్తర్వులు జారీ చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ మార్గదర్శకాలకు అనుగుణంగా లబ్దిదారులను ఎంపిక చేయాలి.. ఈ పథకాలపై జిల్లాల్లో ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్లకు సూచించారు.

## సినిమా టికెట్ల ధరలు, ప్రత్యేక ప్రదర్శనలపై అసంతృప్తి

- ప్రభుత్వ నిర్ణయాన్ని పునఃసమీక్షించాలని హైకోర్టు ఆదేశం
- గేమ్‌ఛేంజర్‌కు ప్రత్యేక అనుమతులపై విచారణ 24కు వాయిదా



**తొలి అక్షరం/హైదరాబాద్,జనవరి 10 :** గేమ్ ఛేంజర్ సినిమా టికెట్ల ధరలు, ప్రత్యేక ప్రదర్శనలపై హైకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. ప్రత్యేక ప్రదర్శనల అనుమతిపై తెలంగాణ హైకోర్టులో శుక్రవారం విచారణ జరిగింది. బెనిఫిట్ షోలు రద్దు చేశామంటూ పరోక్షంగా ప్రత్యేక షోలకు అనుమతి ఇవ్వడమేంటని న్యాయస్థానం ప్రశ్నించింది. అర్ధరాత్రి ఒంటి గంట దాటిన తర్వాత తెల్లవారుజామున షోలకు అనుమతి ఇవ్వడంపై పునసమీక్షించాలని హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిని ఆదేశించిన హైకోర్టు తదుపరి విచారణను ఈనెల 24వ తేదీకి వాయిదా వేసింది. కాగా.. అల్లు అర్జున్ నటించిన పుష్ప 2 సినిమా రిలీజ్ సందర్భంగా సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటలో ఓ మహిళ మృతి చెందగా... బాలుడు అస్వస్థతకు గురయ్యాడు. ఈ కేసుకు సంబంధించి అల్లు అర్జున్ జైలుకు వెళ్లి.. బెయిల్‌పై బయటకు వచ్చారు. అయితే తొక్కిసలాట ఘటనను తెలంగాణ ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. ఇకపై బెన్‌ఫిట్‌షోల కు అనుమతించేది లేదని స్పష్టం చేసింది. దిల్ రాజు నేతృత్వంలో సినీ పెద్దలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలువగా ఇదే విషయాన్ని తేల్చి చెప్పారు సీఎం. ఇదిలా ఉండగా... శంకర్ దర్శకత్వంలో రాంచరణ్ నటించిన గేమ్ చేంజర్ సినిమా టికెట్‌ల ధరల పెంపునకు ప్రభుత్వం అనుమతినిచ్చింది. అర్ధారత్రి ఒంటి గంటకు బెనిఫిట్ షోలకు అనుమతించని ప్రభుత్వం.. తెల్లవారుజామున 4 గంటల నుంచి 6 గంటల షోకు అనుమతినిస్తూ హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవిగుప్తా ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. అయితే గేమ్ ఛేంజర్ సినిమా టికెట్ల పెంపు, స్పెషల్ షోలపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ కొందరు హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్‌ను దాఖలు చేశారు. గురువారం ఈ పిటిషన్‌ను జస్టిస్ బి.విజయ్‌సేన్ రెడ్డి విచారించగా.. గేమ్ చేంజర్ సినిమా స్పెషల్ షోకు అనుమతి ఇవ్వడంపై పిటిషనర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. టికెట్ పెంపుపై ఉత్తర్వులు ఇవ్వకుండా ఆదేశించాలని హైకోర్టును పిటిషనర్ కోరారు. దీనిపై విచారణను శుక్రవారానికి వాయిదా వేసిన కోర్టు.. నేటి విచారణలో ప్రత్యేక షోలకు అనుమతి ఇవ్వడంపై అసంతృప్తి వ్యక్తం చేసింది. తెల్లవారుజామున షోలకు అనుమతి ఇవ్వడంపై పునసమీక్షించాలని హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిని న్యాయస్థానం ఆదేశించింది. తదుపరి విచారణను ఈనెల 24కు హైకోర్టు వాయిదా వేసింది.

## రూ.168 కోట్లతో నేతన్నలకు అభయహస్తం పథకం

(మొదటి పేజీ తరువాయి)



తెలంగాణ నేతన్న పొదుపు (పొదుపు నిధి) ద్వారా చేనేత కార్మికులు తమ వాటాగా 8 శాతం పొదుపు చేస్తే, రాష్ట్ర ప్రభుత్వం 16 శాతం వాటా జమ చేస్తుందని, దీని ద్వారా దాదాపు 38,000 మంది చేనేత కార్మికులు లబ్ధిపొందే అవకాశం ఉందన్నారు. అదే పవర్ లూమ్ కార్మికులైతే వారు 8 శాతం పొదుపు చేసినట్లయితే రాష్ట్ర ప్రభుత్వం 8 శాతం వాటా జమ చేస్తుందని, దీని ద్వారా దాదాపు 15వేల మంది పవర్ లూమ్ కార్మికులు లబ్ధి పొందే అవకాశం ఉందన్నారు.తెలంగాణ నేతన్న భద్రత (నేతన్న భీమా) ద్వారా చేనేత, పవర్ లూమ్ కార్మికులు, అనుబంధ కార్మికులందరికీ జీవిత భీమా వర్తిస్తుందని, నమోదు చేసుకున్న కార్మికులు ఏ కారణంతోనైనా మరణిస్తే, మరణించిన కుటుంబం నామినీకి రూ.5 లక్షల భీమా లబ్ది చేకూరుతుందని తెలిపారు.తెలంగాణ నేతన్నకు భరోసా ద్వారా చేనేత కార్మికులు తెలంగాణ మార్క్ లేబుల్‌ను ఉపయోగించి తయారుచేసిన తెలంగాణ వస్త్ర ఉత్పత్తులను ప్రోత్సహించేందుకు, వేతన మద్దతు అందించే విధంగా పని ఆధారంగా ఒక సంవత్సరానికి ఒక్కొక్క చేనేత కార్మికునికి రూ.18వేల వరకు, అనుబంధ కార్మికునికి రూ.6వేల వరకు మంజూరు చేయడం జరుగుతుందని మంత్రి వివరించారు.ప్రజాప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంలోనే చేనేత రంగానికి రూ.874 కోట్లు విడుదల చేశామన్నారు. అందులో గత ప్రభుత్వం బకాయిగా ఉంచినవే రూ.465 కోట్లు ఉన్నాయని మంత్రి తుమ్మల గుర్తుచేశారు. అలాగే నేతన్నలకు నిరంతరం పనికల్పించాలనే ఉద్దేశంతో అన్నీ ప్రభుత్వ శాఖలు, కార్పొరేషన్లు, సొసైటీలు తప్పని సరిగా తమకు కావలిసిన వస్త్రాలను టెస్కో ద్వారానే కొనుగోలు చేసేవిధంగా ప్రభుత్వం జీవో నెం.1 తేది: 11.03.2024 తీసుకువచ్చామన్నారు. ఇందిరా మహిళా శక్తి చీరల పథకం కూడా అమలుచేస్తున్నామని తెలిపారు. చేనేత కార్మికుల కోసం రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో రూ.50 కోట్ల కార్పస్ ఫండ్‌తో నూలు డిపో ఏర్పాటు చేశామని, నేతన్నలకు చేయూత క్రింద చేనేత కార్మికులకు రూ.290.09 కోట్లు విడుదల చేసినట్లు మంత్రి వెల్లడించారు.రూ. 22.25 కోట్ల నిధులతో నేతన్న భీమా, పావలావడ్డీ పథకం కింద 60 చేనేత సహకార సంఘాలకు రూ.1.09 కోట్లు, మరమగ్గ కార్మికులకు 10శాతం నూలు సబ్సీడీ పథకం కింద 2018 నుంచి 2022 వరకు ఉన్న అన్ని బకాయిలు రూ 37.49 కోట్లు ఈ ఏడాదిలోనే విడుదల చేసిన విషయాన్ని మంత్రి తుమ్మల గుర్తుచేశారు.

# పదో తరగతి విద్యార్థులకు ఆల్ ఇన్‌వన్ పంపిణీ కార్యక్రమం

**• ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీ ఏ రవీందర్ రెడ్డి**





**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),జనవరి10:** జడ్పిహెచ్ఎస్ దంతాలపల్లి లో పదవ తరగతి విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ స్టడీ మెటీరియల్ అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా విద్యాశాఖ అధికారి ఏ రవీందర్ రెడ్డి మాట్లాడుతూ..... సేవే పరమావధిగా ప్రభుత్వ పాఠశాలలోని పిల్లలకు అవసరమైనటువంటి స్టడీ మెటీరియల్,పరీక్ష సామాగ్రిని అందిస్తున్నటువంటి టీచర్స్ క్లబ్ సేవలను మెటీరియల్ అందించిన దాతలు బండ శ్రీనివాస్ రెడ్డి,టి.సురేంద్ర గుప్తా,టీచర్స్ క్లబ్ ప్రెసిడెంట్ చింతల సురేష్ ని అభినందించారు.డీఈవో ఏ రవీందర్ రెడ్డి మాట్లాడుతూ...విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని తల్లిదండ్రులకు గురువులకు మంచి పేరు తీసుకురావాలని,పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని అన్నారు. పదో తరగతి పరీక్షలపై ఉపాధ్యాయులకు, విద్యార్థులకు సూచనలు సలహాలు ఇవ్వడం జరిగింది. క్లబ్ అధ్యక్షులు సురేష్ మాట్లాడుతూ...ఇప్పటికే టీచర్స్ క్లబ్ ఆధ్వర్యంలో వివిధ పాఠశాలలో స్టడీ మెటీరియల్ అందజేశామని, ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతిలో ఉత్తమ ఫలితాల సాధనకై టీచర్స్ క్లబ్ కృషి చేస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో అతిథిగా విచ్చేసిన దంతాలపల్లి మండల విద్యాశాఖ అధికారి శ్రీదేవి మాట్లాడుతూ.....విద్యార్థులు కష్టపడి చదివి పరీక్షలు మంచి మార్కులు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీహెచ్ఎస్ దంతాలపల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పివేణుమాధవ్ రెడ్డి మాట్లాడుతూ...టీచర్స్ క్లబ్ వారు మా పాఠశాలలో చదువుతున్న పదోతరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందించడం అభినందనీయమన్నారు.మా పాఠశాలలో పనిచేస్తున్న సురేంద్ర గుప్తా, బండ శ్రీనివాస్ రెడ్డి ఉపాధ్యాయులు వారి దాతృత్వాన్ని ప్రదర్శించి పదవ తరగతి విద్యార్థులకు మెటీరియల్ అందించడం అభినందనీయమన్నారు. ఈ సేవా కార్యక్రమాలలో టీచర్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి వెలిదే సురేష్ ,కోశాధికారి ఎద్దు వెంకన్న, పూర్వ అధ్యక్షులు రాయపెల్లి యాకయ్య, క్లబ్ ప్రతినిధులు చింతరామయ్య హంగర్ రిలీఫ్ చైర్మన్ తోట రమేష్ , ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# కోటి పుణ్యాలకు సాటి ఈ ముక్కోటి ఏకాదశి

**• తొర్రూర్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ హనుమండ్ల తిరుపతి రెడ్డి**




**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి(సాంబ),జనవరి10:** కోటి పుణ్యాలకు సాటి ఈ ముక్కోటి ఏకాదశి అని తొర్రూర్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ హనుమండ్ల తిరుపతి రెడ్డి అన్నారు.శుక్రవారం తొర్రూరు పట్టణ కేంద్రంలోని పటిమిడ దేవాలయంలో బేడ(బుడగ)జంగం యువకులు శివమాలలు వేస్తున్న సందర్భంగా బేడ(బుడగ)జంగం రిజర్వేషన్ పోరాట సమాఖ్య సంఘం యువజన నాయకుడు పస్తం సాంబ ఆహ్వానం మేరకు ముఖ్య అతిథిగా తొర్రూర్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ హనుమండ్ల తిరుపతి రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....ముక్కోటి ఏకాదశినాడు ఉపవాసం ఉంటే మిగతా ఏకాదశి రోజులలన్నింటిలోనూ ఉపవాసం ఉన్నంత ఫలం దక్కుతుందని భక్తుల నమ్మకమని అన్నారు.ఈ ముక్కోటి ఏకాదశి విశిష్టత ఏమిటంటే..శ్రీ మహావిష్ణువు తన గరుడ వాహనంపై ముక్కోటి దేవతలతో కలిసి భూలోకానికి వచ్చి దర్శనమిస్తాడని భక్తుల ప్రగాఢ విశ్వాసం అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో తొర్రూర్ మున్సిపాలిటీ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, పిజ్జాల అనిల్, గౌరీ శంకర్, రామ్మూర్తి, శివ స్వాములు తుర్పాటి శివగోపాల్, పూజారి కళ్యాణి సారయ్య, గురుస్వామి టేకు సమ్మయ్య, ఎన్ జంపా,టి సాగర్, ఎస్ కృష్ణమూర్తి, నాగేష్, ఎన్ అనిల్, పి ఉప్పయ్య, పి హుస్సేన్, ఏ వెంకన్న,ఎస్ జంపా, ఎస్ కిరణ్,తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ పోలీసుల అవగాహన సదస్సు






**తొలి అక్షరం/షాద్ నగర్, జనవరి10:** జాతీయ రహదారి భద్రత మహోత్సవాలలో భాగంగా సిపి ఆదేశాల మేరకు షాద్నగర్ పట్టణంలో ట్రాఫిక్ పోలీస్ వారు అవగాహన సదస్సు నిర్వహించారు. డిసిపి LT నాయక్ మీడియాతో మాట్లాడుతూ... గవర్నమెంట్ ఆఫ్ ఇండియా రోడ్డు భద్రత వారోత్సవాలు జనవరి 1వ తేదీ నుండి 31వ తేదీ వరకు జరుపుకోవాలని ఇచ్చిన సర్కులర్ మేరెకు సైబరాబాద్ సిపి యొక్క ఆదేశానుసారం ఈ అవగాహన సదస్సు నిర్వహించామని అదేవిధంగా బెంగళూరు హైవే కాబట్టి ఇక్కడ రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతాయి వీటిని తగ్గించే క్రమంలో ఒక అవగాహన సదస్సు పెట్టాలని ఉద్దేశంతో ట్రాఫిక్ ట్రైని ఇన్స్టిట్యూట్ నుండి వాహనాన్ని పంపించి అందులో కొన్ని వీడియోలలో హెల్మెట్ లేకుండా డ్రైవింగ్ చేయడం వలన మరణం ఎలా సంభవిస్తుంది, అజాగ్రత్తగా రోడ్డు దాటేటప్పుడు ప్రమాదం ఎలా జరుగుతుంది, వాహనాలు యూటర్న్ చేసేటప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి అన్ని వీడియోలు కూడా రెండు నుంచి మూడు నిమిషాలు చూపించడం జరిగింది. దీనివల్ల ఏమిటంటే జనవరి 20వ తేదీ నుండి 31వ తేదీ వరకు మాకు టార్గెట్ ఇవ్వడం వలన రోడ్డు ప్రమాదంలో తగ్గించాలని ఉద్దేశంతో అందులో భాగంగానే షాద్నగర్ పట్టణంలో ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రవీందర్ నాయక్ ఆధ్వర్యంలో ఈ అవగాహన సదస్సును నిర్వహించడం జరిగింది. దయచేసి తల్లిదండ్రులు మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వకుండా జాగ్రత్త పడాలని, లైసెన్సు కచ్చితంగా ఉండాలని, ఇన్సూరెన్స్ కూడా చేయించుకోవాలని అన్ని జాగ్రత్తలు పాటించాలని పోయిన సంవత్సరం కంటే ఈ సంవత్సరం రోడ్డు ప్రమాదాలు తగ్గించాలని, పోయిన సంవత్సరం 450 రోడ్డు ప్రమాదాలు జరిగాయి కానీ ఈ సంవత్సరం సగం వరకు తగ్గించాలని అందుకు మీ అందరి సహకారం కావాలని కోరారు.

## మెట్టు రామలింగేశ్వర స్వామి వారిని దర్శించుకున్న వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



**తొలి అక్షరం/హనుమకొండ ప్రతినిధి: జనవరి 10:** వైకుంఠ ఏకాదశి పర్వదినం పురస్కరించుకొని ప్రతి ఒక్కరిపై ఆ వైకుంఠవాసుడి దివ్యాశీస్సులు ఉండాలని ప్రార్థిస్తూ శుక్రవారం కాజీపేట మడికొండ శ్రీ మెట్టు రామలింగేశ్వర స్వామి సహిత శ్రీ సీతా రామచంద్ర, అనంత పద్మ స్వామి వార్లను దర్శించుకొని దేవాలయాలలో ప్రత్యేక పూజలు అభిషేకాధి కార్యక్రమాలు నిర్వహించిన వర్ధన్నపేట ఎమ్మెల్యే విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజ్, కుడా చైర్మన్ ఇనుగాల వెంకటరామిరెడ్డి తొలుత ఆలయ ప్రధాన అర్చకులు ఎమ్మెల్యే, చైర్మన్ ను వేద మంత్రాల నడుమ పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే, చైర్మన్‌కు అర్చకులు స్వామి వారి శేష వస్త్రాలను అందజేసి ఆశీర్వచనం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మెట్టుగుట ఆలయ చైర్మన్ శ్రీ పైడిపాల రఘు చందర్, డైరెక్టర్లు, ఆలయ ఈవో శేషభారతి, ప్రజా ప్రతినిధులు మాజీ ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు బోనస్ ఎగవేతకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రా...

**• నెలరోజులుగా రైతులకు అందని బోనస్: మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి**



**తొలి అక్షరం/నర్సంపేట, జనవరి 10:** రైతు భరోసా ఎగవేతకు సన్నాలకు బోనస్ తో కుట్ర చేసినా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రుణమాఫీ,రైతూభరోసా,బోనస్ చెల్లించడంలో విఫలమైనా కాంగ్రెస్ నర్సంపేట మాజీ శాసనసభ్యులు పెద్ది సుదర్శన్ రెడ్డి బోగస్ గా బోనస్..రైతుల నెత్తిన కుచ్చుటోపీ పెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం సన్నాలకు బోనస్ అంటూ రైతులకు సున్నం పెట్టిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం. ఉమ్మడి జిల్లాలో చెల్లించని 85.24 కోట్ల రూపాయల బోనస్ డబ్బులు.33,958 మంది రైతులకు బోనస్ అందించకపోవడం కాంగ్రెస్ దిగజారుడుతనానికి నిదర్శనం రైతు రుణమాఫీలో మోసం,రైతు భరోసా ఎగవేత,బోనస్ బోగస్ గా మారింది.కాంగ్రెస్ పాలనలో రైతన్న బ్రతుకును ఆగం అవుతుంది.నెలరోజులుగా రైతులు బోనస్ కోసం పడిగాపులు కాస్తున్నా పట్టింపులేని కాంగ్రెస్.రేవంత్ రెడ్డి సర్కారుకు రాజకీయ కక్షసాదింపు చర్యలు,పేదోళ్ళ ఇండ్ల కూల్చివేతలపై ఉన్న శ్రద్ధ రైతులపై లేదు.ఇచ్చిన మాట ప్రకారం బోనస్ డబ్బులను రైతుల ఖాతాల్లో జమ చేయాలి.కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలు, వరంగల్ రైతు డిక్లరేషన్ లో రైతులకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నేడు రైతులను ఆదుకోవడంలో విఫలమైంది . రైతులు పండించిన అన్ని పంటలకు బోనస్ చెల్లిస్తామని చెప్పి చివరకు కేవలం వారికి సన్న రకాలకు మాత్రమే బోనస్ చెల్లిస్తామని వడ్లు కొనుగోలు చేసి నెల రోజులు గడిచిన రైతులకు ఇప్పటివరకు బోనస్ అందడం లేదు.యాసంగి పంటకాలం ప్రారంభమై రైతు వ్యవసాయం పనులు చేసుకుంటుంటే వారికి పెట్టుబడి సాయం కింద అందవలసిన రైతు భరోసా అనేక షరతులు విధించి రేపు మాపు అంటూ ఆలస్యం చేస్తూనారు. రైతులు వర్షాకాలం పండించిన పంటలను కొనుగోలు చేసిన రాష్ట్ర ప్రభుత్వం బోనస్ చెల్లిస్తా అని చెప్పి రైతుల వద్ద వడ్లు కొనుగోలు చేసి బోనస్ చెల్లించకుండా మోసం చేస్తుంది. యూరియా కొరతా,కరెంటు కోత,రైతుబారొసా,బోనస్ అందక రైతులను గోసపెడుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం,వ్యవసాయాన్ని నిర్లక్షం చేస్తుందని అన్నారు.



## తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే దొంతి దంపతులు

**తొలి అక్షరం/నర్సంపేట, జనవరి 10:** నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి కుటుంబ సమేతంగా వైకుంఠ ఏకాదశి పర్వదిన సందర్భంగా కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల తిరుపతి శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని వేకువ జామున కుటుంబ సమేతంగా దర్శించుకున్న నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి మాట్లాడుతూ..శ్రీవారి ఆశీస్సులు రాష్ట్ర ప్రజలందరిపై ఉండాలని శ్రీవారి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో, ఆయుఆరోగ్యాలతో ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకోవడం జరిగిందని అన్నారు.

## సహావిద్యార్థి కుటుంబానికి హార్దిక భరోసా అందించిన ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు,విద్యార్థులు



**తొలి అక్షరం/చెన్నారావుపేట, జనవరి 10:** చెన్నారావుపేట మండల కేంద్రంలో ని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల పాపయ్యపేట లో 9వచదువుతున్న వెంకటేష్ వారి తల్లీ వెంకటమ్మ కొద్దిరోజుల క్రితం అనారోగ్య కారణాలతో మరణించడం జరిగింది. అయితే సహ విద్యార్థి కి పాఠశాల తరపున విద్యార్థులు ఉపాధ్యాయ బృందం తరపున ఆర్థిక సహాయాన్ని అందించారు.ఈ కార్యక్రమం లో ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్ రావు,ఉపాధ్యాయ బృందం వెంకట రమణ,కృష్ణమూర్తి హరీష్ మధు బాబు, షహీదా బిక్షపతి నరసింహ, రాములు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

## యువత క్రీడల్లోనూ రాణించాలి:దుద్దిల్ల శ్రీను బాబు



**తొలి అక్షరం/మంథని:** శుక్రవారం రోజున రామగిరి మండలంలోని రాణి రుద్రమదేవి స్టేడియంలో రామగిరి మండల కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో అజాతశత్రువు ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర మాజీ శాసనసభావతి శ్రీపాద రావు స్మారకార్థం మంథని డివిజన్ స్థాయి టికెట్ టోర్నమెంట్ ప్రారంభించిన దుద్దిల్ల శ్రీను బాబు.యువత చదువుతోపాటు,క్రీడ ల్లోనూ రాణిం చాలని దుద్దిళ్ల శ్రీను బాబు అన్నారు. టోర్నీని కాంగ్రెస్ నాయ కులు నిర్వాహకులతో కలిసి ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని వారిని ఉద్దేశించి మాట్లాడారు. యువత చెడు వ్యసనాల బారిన పడకుండా శారీరక ధృడత్వం, మానసికోల్లాసం కలిగించే క్రీడల్లో పాల్గొనాలన్నారు. క్రీడా స్ఫూర్తిని ప్రదర్శిస్తూ పోటీలను విజయవంతం చేయాలన్నారు.

## ప్రజలందరు ఆయురారోగ్యాలతో ఉండాలి: దుద్దిల్ల శ్రీను బాబు....

**తొలి అక్షరం/రామగిరి:** ఈ రోజు తెల్లవారుజామున 5 గంటల కు రామగిరి మండలం లద్నాపూర్ గ్రామంలో స్వయంభు వెలిసిన శ్రీ గోదా రంగనాయక స్వామి ఆలయంలో ఉత్తర ద్వారా దర్శనం ద్వారా స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి అభిషేక కార్యక్రమంలో పాల్గొన్న శ్రీ దుద్దిల్ల శ్రీను బాబు.అనంతరం సెంటినరీ కాలనీ లో శ్రీ కోదండ రామాలయం,శ్రీ షిర్డీ సాయి బాబా ఆలయాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన దుద్దిల్ల శ్రీను బాబు,ఆలయంలో ఉన్నటువంటి భక్తులను ఆప్యాయంగా పలకరించుకుంటు ప్రజలందరికి వైకుంఠ ఏకాదశి మరియు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంథని నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగిందని అన్నారు.ఈ కార్యక్రమంలో రామగిరి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# పార్టీ కోసం సైనికుల పని చేయాలి..

- వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు
- కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు రమేష్



**తొలి అక్షరం/నరసింహుల పేట, జనవరి 10:** మండలంలోని పెద్దనాగారం అజ్మీర తండా వస్త్రం తండా గొప తండా పెద్దనాగరం స్టేజి వివిధ గ్రామ పంచాయతీలలో కాంగ్రెస్ పార్టీ మండల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో ఆయా గ్రామ కార్యకర్తల ముఖ్య కార్యకర్తల సమావేశం గ్రామాలలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జినుకల రమేష్ మాట్లాడుతూ రానున్న స్థానిక ఎన్నికలలో ప్రతి గ్రామ పంచాయతీలో సర్పంచ్ వార్డు ఎంపీటీసీ జడ్పిటిసి అన్ని స్థానాలను కైవసం చేసుకుని క్లీన్ స్విప్ దిశగా అడుగులు వేయాలని రమేష్ సూచించారు. రానున్న ఎన్నికల్లో పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు గ్రామ స్థానిక కార్యకర్తల సూచనల మేరకు గ్రామస్థాయి యిలో స్థానిక ఎన్నికలలో అభ్యర్థులు ఎవరు అనేది త్వరలోనే తెలుపుతామని పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతూ పార్టీని అప్రతిష్ట పాలు చేస్తే ఎంతటి స్థాయి నాయకులైన సస్పెండ్ చేస్తామని వారు హెచ్చరించారు. స్థానిక నాయకులు గ్రామ ఓటర్లపై ప్రతి వార్డులో పూర్తిస్థాయి అవగాహన కల్పించుకుని ఎన్నికలకు సిద్ధం కావాలని వారు కోరారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో అభివృద్ధి చెందుతుందని త్వరలోనే ఇందిరమ్మ రైతు భరోసా అందరికీ రైతులకు వస్తాయని ధైర్యం చెప్పారు. ఇచ్చిన ప్రతి హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తుందని బిఆర్ఎస్ నేతలు చేతకాక అధికారం కోల్పోయి అనేక రకాల తప్పుడు మాటలు మాట్లాడుతున్నారని రానున్న స్థానిక ఎన్నికల్లో టిఆర్ఎస్ అడ్రస్ గల్లంత కావడం ఖాయమని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సమన్వయ కమిటీ కన్వీనర్ అలవాల శ్రీనివాస్ జిల్లా యూత్ కాంగ్రెస్ నాయకులు చిర్ర సతీష్ గౌడ్ జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సోమిరెడ్డి మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ రామకృష్ణ ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ సెల్ అధ్యక్షులు మహబూబ్ ఖాన్ దస్రు నాయక్ గుండ గాని వెంకన్న డప్పు కాటే ఎంకన్న వివిధ గ్రామ శాఖ అధ్యక్షులు రామకృష్ణ రమేష్ రాజేందర్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు దోమల యాదగిరి గౌని యాదగిరి యూత్ కాంగ్రెస్ నాయకులు రేఖ అనిల్ కుమార్ యాదవ్ ముఖేష్ వీరన్న ఉపేందర్ గౌడ్ నిమ్మల శ్రీనివాస్ యాదవ్ రఫీ సీతారాం వెంకన్న వెంకటరెడ్డి అశోక్ మధుకర్ రెడ్డి ప్రవీణ్ మహేష్ చలమల్ల వీరన్న చలమల్ల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# షాద్ నగర్ పట్టణంలోని కృష్ణవేణి ఉన్నత పాఠశాలలో ఆవరణలో సంక్రాంతి పండుగ సంబరాలు

- పాఠశాల ఆవరణలో సంక్రాంతి ముగ్గుల మాయం





**తొలి అక్షరం/షాద్ నగర్, జనవరి10:** రంగారెడ్డి జిల్లా,షాద్ నగర్ పట్టణంలోని కృష్ణవేణి ఉన్నత పాఠశాల భాగ్యనగర్ కాలనీ షాద్ నగర్ నందు పాఠశాల ఆవరణలో విద్యార్థులు అందరూ సంక్రాంతి సంబరాలు ఎంతో ఘనంగా జరుపుకున్నారు ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థినులు అందరూ పాఠశాల ప్రాంగణంలో ఎంతో అందమైన రంగు రంగుల రంగవల్లికలను ఎంతో చాకచక్యంగా నైపుణ్యంతో ఓర్పుతో చక్కగా ప్రదర్శించారు. పాఠశాల ప్రిన్సిపల్ రఫత్ సుల్తానా పండగ ప్రాముఖ్యతను దాని వెనుక ఉన్న కథను పిల్లలందరికీ వివరించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ సూర్యుడు మకర రాశిలో ప్రవేశించే రోజును మకర సంక్రాంతి అంటారు అని తెలియ పరచారు.రాళ్ళూ రప్పలూ లేకుండా ఒక పద్ధతిలో అలకబడిన నేల, మేఘాలు లేని ఆకాశానికి సంకేతం. ఒక పద్ధతిలో పెట్టబడు చుక్కలు రాత్రి వేళ కనిపించే నక్షత్రాలకు సంకేతం. చుక్కలచుట్టూ తిరుగుతూ చుక్కలను గళ్ళలో ఇమిడ్చే ముగ్గు ఖగోళంలో ఎప్పడికప్పుడు కనిపించే మార్పులకు సంకేతం. ఎంత పెద్దదైనా చిన్నదైనా ముగ్గు మధ్య గడిలో పెట్టే చుక్క సూర్య స్థానానికి సంకేతం. ఇంకొక దృక్పథంలో గీతలు స్థితశక్తికి,చుక్కలు గతిశక్తి కు సంకేతాలని వివరించారు. మరియు ఈ పండగ మూడు రోజుల్లో జరుపుకొనే పండగ అని తెలియ పరిచారు. ఇట్టి పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు.ఇందులో పాఠశాల ఉపాధ్యాయులు బృందం విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# శబాష్ కబీర్ భాయ్

- సేవలో ఎప్పుడు ముందుండాలి: ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
- ప్రభుత్వ కళాశాలలో క్రీడా సామాగ్రి అందజేత





**తొలి అక్షరం/షాద్ నగర్, జనవరి10:** ప్రజాసేవ కు మంచి హృదయం ఉండాలి. స్పందించే గుణం ఉండాలి. అలాంటి మంచి గుణం, స్పందించే తత్వం షాద్ నగర్ క్రికెట్ క్లబ్ ప్రధాన అధ్యక్షులు, కాంగ్రెస్ యువనేత, షాద్ నగర్ రియల్ ఎస్టేట్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కబీర్ భాయ్ సొంతం.క్రీడాకారులను ప్రోత్సహించడం లో ఎప్పుడు ముందుండే కబీర్ అహ్మద్ వారిని ప్రోత్సహించి ముందుకు సాగుతూ క్రీడాకారులకు కావాల్సిన సామాగ్రి అందజేస్తు తన దానగుణం తో మన్ననలు పొందుతూ ముందుకు సాగుతున్నారు. ఈ సందర్భంగా షాద్ నగర్ లో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రతిష్టత్మాకంగా చేపడుతున్న నూతన కళాశాల భవనం కు తనవంతు సాయంగా కళాశాల విద్యార్థులకు క్రీడాసామాగ్రి అందజేశారు. క్రికెట్ కిట్స్, క్యారం బోర్డ్స్, చెస్ బోర్డ్స్, రింగ్ బాల్స్, షటిల్ బ్యాట్స్,తదితర సామాగ్రి తన సొంత ఖర్చులతో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సమక్షంలో కళాశాల విద్యార్థులకు అందజేశారు. ఇంతకుముందు కూడ కళాశాల కొరకు 100 కుర్చీలు తనవంతు సాయం గా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఎల్లప్పుడూ క్రీడాకారులను ప్రోత్సహిస్తున్న కబీర్ అహ్మద్ ను అభినందించారు. ఈ కార్యక్రమం లో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, చెంది తిరుపతి రెడ్డి,బస్వం అప్ప, పురుషోత్తం రెడ్డి,భార్గవ్ రెడ్డి,వీర్లపల్లి అన్వార్,తంగళ్లపల్లి శంకర్,చిన్న పాల్గొన్నారు.

# ముగ్గుల పోటీలో పాల్గొన్న విద్యార్థులు

- సీతారాంపురం ప్రాథమిక పాఠశాలలో సంక్రాంతి సంబరాలు



**తొలి అక్షరం/మరిపెడ, జనవరి 10:** సంక్రాంతి అంటే పెద్ద పండుగని,పంటల పండుగని, పెద్దల పండుగని,పశువుల పండుగ పుడమి పుస్తకంలో ప్రకృతి రాసుకున్న మధురమైన కవిత. గీసుకున్న అద్భుతమైన చిత్రిక. హరితవర్ణపు చీరను కట్టుకుని, బంతి చేమంతులను జడలో తురుముకుని ..రంగవల్లికల రంగుల దారిలో నడిచి వచ్చే సంక్రాంతి దేవతను చూసి మురిసిపోని మనిషి వుండడని. సంబరపడని కర్షకుడు వుండడని. మనిషికి తెలిసిన తొలి పండుగ సంక్రాంతే! బీడు నేలను దుక్కి దున్ని పంటసిరిగా మార్చిన మానవుడికి ఇదే తొలి పండుగ అని సీతారాంపురం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు గుగులోత్ అర్జున్ నాయక్ అన్నారు.అప్పట్నుంచే మనిషి జీవితం బహు ముఖాలుగా, బహు విధాలుగా వికసించిందని,అభ్యున్నతి దిశగా అడుగులు వేసిందని అన్నారు. దీనంతటికి కారణం సూర్యుడు. సూర్య భగవానుడే మనకు జీవాధారమని,సమస్త జీవరాశికి, వృక్షజాతి మనుగడకు ఆయనే కారణం అని అన్నారు.ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటుచేసిన ముగ్గుల పోటీలు ఉద్దేశించి మాట్లాడుతూ సంక్రమణం అంటే గమనం. సూర్యుడు ఒక రాశి నుంచి మరో రాశిలోకి అడుగుపెట్టడాన్ని సంక్రమణం అంటామని,ఏడాదిలో సూర్యుడు పన్నెండు రాశులలో ప్రవేశిస్తాడని. ఈ నెలలో ప్రవేశించేది మకర రాశిలోకి. అందుకే ఇది మకర సంక్రాంతి అయ్యిందని,పుష్యమాసంలో వచ్చే మకర సంక్రమణం ఉత్తరాయణానికి నాంది, పుణ్యప్రదం కూడా.అందుకే మకర సంక్రాంతి శుభవేడుకగా మారిందని అన్నారు.పాఠశాల ఉపాధ్యాయులుమంగీలాల్,లింగాల మహేష్ గౌడ్,కవిత, వెంకటేశ్వరరావు, ఆదిలక్ష్మి, సందీప్,సారిక,విద్యార్థని,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# సెంట్ మేరీ గీతాంజలి స్కూల్ విద్యార్థిని హార్షిత కుంగ్ ఫు స్ప్రైరింగ్ విభాగంలో ప్రథమ బహుమతి గోల్డ్ మెడల్ కైవసం

- స్కూల్ ప్రిన్సిపాల్ జగదీష్, కరస్పాండెంట్ రాజన్ అబ్రహం చేతుల మీదుగా మెడల్, సర్టిఫికెట్ అందజేత



**తొలి అక్షరం/షాద్ నగర్, జనవరి10:** రంగారెడ్డి జిల్లా,షాద్ నగర్ పట్టణం లోని కుంట్ల రామ్ రెడ్డి ఫంక్షన్ హాల్ లో యాదవ్ బుడోఖాన్ కరాటే క్లబ్ మాస్టర్ సాయినాథ్ అధ్యర్యంలో జరిగిన 38 వ ఆల్ ఇండియా లెవల్ ఓపెన్ కరాటే, కుంగ్ ఫు ఛాంపియన్ షిప్ 2025 టోర్నమెంట్ లో షాద్ నగర్ పట్టణానికి చెందిన న్యూ పవర్ కుంగ్ ఫు అకాడమీ మాస్టర్స్ బాలరాజ్, అహ్మద్ ఖాన్( బ్రూస్ లీ ) అధ్యర్యంలో సెంట్ మేరీ గీతాంజలి స్కూల్ విద్యార్థిని హర్షిత స్ప్రైరింగ్ విభాగంలో అద్భుతమైన ప్రదర్శన కనబర్చి గోల్డ్ మెడల్, సర్టిఫికెట్ కైవసం చేసుకుంది. స్కూల్ కరస్పాండెంట్ రాజన్ అబ్రహం విద్యార్థిని శాలువాతో ఘనంగా సన్మానించి సర్టిఫికెట్,గోల్డ్ మెడల్ అందజేశారు .ఈ సందర్భంగా బాలరాజ్ మాస్టర్ మాట్లాడుతూ ఈ రోజుల్లో అమ్మాయిలు, చిన్నపిల్లలు దృడంగా తయారు కావాలంటే కుంగ్ ఫు, కరాటే నేర్చుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు కిరణ్, ఇంద్ర, స్కూలు ఉపాధ్యాయులు మాణిక్యం పిటి, నరేష్,విద్యార్థినీ,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# వైకుంఠ ఏకాదశి రోజున ఉత్తరద్వార దర్శనం చేస్తే పుణ్య ఫలం లభిస్తుంది

- వెంకటేశ్వర స్వామి దేవాలయంలో మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు తో ఉత్తర ద్వార దర్శనంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
- హిందూ సనాతన ధర్మం ప్రకారం వైకుంఠ ఏకాదశి ఒక ప్రత్యేకత
- షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**తొలి అక్షరం/షాద్ నగర్, జనవరి10:** ముక్కోటి ఏకాదశి రోజున ఉత్తర ద్వార దర్శనం చేసుకుంటే పుణ్యఫలం లభిస్తుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శుక్రవారం వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులు తో కలిసి ఉత్తర ద్వార దర్శనాన్ని చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ.... హిందూ సనాతన ధర్మం ప్రకారం వైకుంఠ ఏకాదశి ఒక ప్రత్యేకత ఉందని అన్నారు. వైకుంఠ ఏకాదశి రోజున సూర్య భగవానుడు ఉత్తర దిగ్భాగంలో ప్రయాణం చేస్తూంటారని అన్నారు. ఈ రోజున మనం ఉత్తర ద్వారా దర్శనం చేసుకున్నట్లయితే తప్పకుండా కైవల్యం లభిస్తుందని అన్నారు. ఆ శ్రీమన్నారాయణ మూర్తి అనుగ్రహంతో పాటు భవ బంధనాలన్నీ కూడా తొలగిపోయి మానసిక ప్రశాంతత లభిస్తుందని అన్నారు. వైకుంఠ ఏకాదశి రోజు ముప్పది మూడు కోట్ల దేవతలతో ఆ స్వామి మనకు దర్శనమిస్తారని అన్నారు. కాబట్టి ఉత్తర ద్వార దర్శనం చేసుకుంటే తప్పకుండా కోరిన కోరికలు నేరవేరుతాయి అన్నారు. ఆ స్వామివారి చల్లని చూపులు ప్రతి ఒక్కరిపై ఉండాలని, ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో అష్ట ఐశ్వర్యాలతో ఉండాలని కోరుకున్నట్లు ఆయన తెలిపారు. స్వామి వారిని దర్శించుకున్న వారిలో నాయకులు కొంకళ్ళ చెన్నయ్య, చెంది తిరుపతి రెడ్డి, చల్లా శ్రీకాంత్ రెడ్డి, అగ్గనూరి బస్వం అప్ప, తుపాకుల శేఖర్, నెహ్రూ నాయక్, రాయికల్ శ్రీనివాస్, మాధవులు, అంజి యాదవ్, బచ్చలి నరేష్, మాణిక్యం, లింగారెడ్డి గూడ అశోక్, నందిగామ శేఖర్, కిట్టు తదితరులు పాల్గొన్నారు.



# ముగ్గులతో ముస్తాబైన శ్రీ కాకతీయ హై స్కూల్

- పాల్గొన్న విద్యార్థులు, తల్లిదండ్రులు





**తొలి అక్షరం/షాద్ నగర్, జనవరి10:** రంగారెడ్డి జిల్లా,షాద్ నగర్ పట్టణం లోని భాగ్యనగర్ కాలనీలో శ్రీ కాకతీయ హై స్కూల్ ప్రిన్సిపాల్ స్వాతి రెడ్డి అధ్యర్యంలో నిర్వహించిన ముగ్గులు, డ్రాయింగ్ పోటీల్లో స్కూల్ విద్యార్థులు, పేరెంట్స్ పాల్గొని స్కూల్ మైదానం లో రంగురంగుల ముగ్గులు వేశారు. సంక్రాంతి ముగ్గులు,హ్యాపీ న్యూ ఇయర్ ముగ్గులు గొబ్బేమ్మలతో ముస్తాబు చేసి అలరించారు. తరువాత డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఇందులో స్కూల్ ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, తల్లితండ్రులు పాల్గొన్నారు.

# ఇసుకకు ఇక నో పర్మిషన్.!

- చిన్నగూడూర్ తహసీల్దార్ - మహబూబ్ ఆలీ.!



**తొలి అక్షరం/చిన్న గూడూరు జనవరి 10:** ఆకేరు పరివాహక ప్రాంత పంట పొలాలు ఎండిపోయే ప్రమాదం వుంది అంటూ రైతులు అర్జీలు పెడుతున్న నేపథ్యంలో RDO గణేష్ ఆదేశాల మేరకు చిన్నగూడూర్ తహసీల్దార్ మహబూబ్ ఆలీ ఇసుక కూపన్ లను నిలిపిస్తున్నట్లు తెలిపారు.అత్యవసర వర్క్ లకు కూపన్ లు వున్నప్పటికి రైతుల ఇబ్బందుల దృష్ట్యా ఇసుక కూపన్ లను నిలిపివేయడం జరిగింది అని ఎవరైనా అక్రమ ఇసుక రవాణా కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని స్థానిక తహసీల్దార్ హెచ్చరించారు.

# పాఠశాలల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలు



**తొలి అక్షరం/పాపన్నపేట జనవరి 10:** మండల పరిధిలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో శుక్రవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. శనివారం నుండి పాఠశాలలకు సెలవులు కావడంతో విద్యార్థులు రంగు రంగుల ముగ్గులు వేశారు. ఈ సందర్భంగా విజేతలకు ప్రధానోపాధ్యాయులు బహుమతులు అందజేశారు

# రంగవల్లులు సృజనాత్మకతకు చిహ్నాలు

- ప్రధానోపాధ్యాయులు అక్కెనపల్లి సతీష్ కుమార్

**తొలిఅక్షరం/నెక్కొండ, జనవరి 10:** వరంగల్ జిల్లా పర్వతగిరి మండల పరిధిలో రంగవల్లులలతో విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీయవచ్చు అని విజ్ఞాన భారతి విద్యాలయం కరస్పాండెంట్ అక్కినపెల్లి సతీష్ కుమార్ అన్నారు. మండలంలోని చింత నెక్కొండ గ్రామం విజ్ఞాన భారతి విద్యాలయంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని శుక్రవారం విద్యార్థులకు రంగవల్లుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ మాట్లాడుతూ రంగవల్లులు మన సంస్కృతీ, సంప్రదాయాలకు ప్రతీకలని అన్నారు. ఈ కార్యక్రమంలో సుమారు 50 మంది విద్యార్తినీ, విద్యార్థులు పాల్గొని ముగ్గులు వేశారు. అనంతరం విజేతలను ఎంపిక చేసి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి అనిల్ కుమార్ ఆర్గనైజర్ గా వ్యవహరించారు. ఉపాధ్యాయులు మహిళా ఉపాధ్యాయినిలు సరిత,రాజేశ్వరి, సుమలత, లత, ప్రశాంతి,లావణ్య,స్వాతి తదితరులు పాల్గొన్నారు.



# మెగా హెల్త్ క్యాంప్ ప్రారంభించిన ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య

**● మెగా హెల్త్ క్యాంపుకు తీసుకురావడానికి తన శక్తి సామర్థ్యాలను ఉపయోగించి సక్సెస్ చేసిన మనందరి ప్రియతమ నాయకుడు ప్రజల ఆశాజ్యోతి అందరికీ ఆప్యాయత మిత్రుడు - భూక్య,ప్రవీణ్ నాయక్**






**తొలి అక్షరం/బయ్యారం డిసెంబర్10:** మహబూబాద్ జిల్లా బయ్యారం మండలం కొత్తపేట గ్రామపంచాయతీలో ఈరోజు జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి భూక్య ప్రవీణ్ నాయక్ సారథ్యంలో బయ్యారం మండలం కొత్తపేట గంధంపల్లి గ్రామం స్థానిక వెనిగళ్ళ జగ్గయ్య ఫంక్షన్ హాల్లో "మైత్రి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్" ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా హెల్త్ క్యాంపును కోరం, కనకయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద ప్రజల కోసం హెల్త్ క్యాంపులు నిర్వహించి ఉచితంగా వైద్యం మెడిసిన్ అందించిన "మైత్రి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్" యాజమాన్యాన్ని మరియు హెల్త్ క్యాంప్ ను ఇంత సక్సెస్ ఫుల్ కావడానికి కృషి చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులను కార్యకర్తలను ముఖ్యంగా జిల్లా కార్యదర్శి భూక్య ప్రవీణ్ నాయక్ డాక్టర్ బాలు నాయక్ ను అభినందించారు. అందులో భాగంగా బయ్యారం మండలం కు చెందిన నూతనంగా వివాహం చేసుకున్న కుటుంబాలకు 18 కల్యాణ లక్ష్మి చెక్కులను అందించారు. అలాగే కాంగ్రెస్ పార్టీలో చేరిన ఐఎఫ్.టి.యు హమాలీ యూనియన్ నాయకులు అలాగే సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ గ్రామ కమిటీ సభ్యులు యూనియన్ మొత్తాన్ని ఈ రోజు ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య 40 నుండి 50 మంది ని కాంగ్రెస్ పార్టీలోకి కండోలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పి.ఎ.సి.ఎ.స్ చైర్మన్ మూల మధుకర్ రెడ్డి ,పి.ఎ.సి.ఎస్ డైరెక్టర్లు తిరుమల, ప్రభాకర్ రెడ్డి జూలకంటి,సీతారాం రెడ్డి మండల అధ్యక్షుడు ముసలయ్య,మాజీ మండల అధ్యక్షులు వడ్లమూడి, సురేష్ సంతులాల్ పోడ్ తండా గ్రామ శాఖ అధ్యక్షులు భూక్యా, సతీష్ నాయక్ బోడ, గణేష్ మట్ల కిషోర్ అన్నపూర్ణ ఐ ఎన్ టి యు ఎస్ మండల అధ్యక్షుడు బొమ్మ కంటి, రాంబాబు, మాజీ వార్డు మెంబర్ చల్లా సురేష్ ఐ ఎన్ టి యూ సి మండల కార్యదర్శి బరిగెల ఉపేందర్,రాసమళ్ళ, నాగేశ్వరావు చెరుకుపల్లి, నరసయ్య తమ్మిశెట్టి, వెంకటపతి ,మండ, నాగరాజు , పుల్లూరి, బాలరాజు బోడా,సాయి కృష్ణ కొల్లిపాక, రవి,మరికంటి, శ్రీను భూక్యా, శ్రీను భూక్యా బాలకృష్ణ పెనుగొండ,పుల్లయ్య సంతోష్ ఉమ్మడి,రాము నున్న, రామయ్య కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజలుతదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించిన టిపిసిసి సభ్యులు సొంటి రెడ్డి



**తొలిఅక్షరం/నెక్కొండ, జనవరి 10:**వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలోని స్థానిక మార్కెట్ లో ప్రజావాణి నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించిన టిపిసిసి సభ్యులు సొంటిరెడ్డి రంజిత్ రెడ్డి, కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బక్కి అశోక్,మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీష్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పెండ్యాల హరిప్రసాద్,రామాలయ కమిటీ చైర్మన్ కొమ్మారెడ్డి సుధాకర్ రెడ్డి,జిల్లా ఓబీసీ ప్రధాన కార్యదర్శి రాచకొండ రఘు,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొల్లి సుబ్బారెడ్డి కుసుమ చెన్నకేశవులు,యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు సింగం ప్రశాంత్,మార్కెట్ కమిటీ డైరెక్టర్ రావుల మైపాల్ రెడ్డి,చిన్న సుబ్బారెడ్డి,రవి తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ నుండి బత్తిని రామ్మూర్తి గౌడ్ సస్పెండ్ అనే నాటకం అవివేకం



**తొలి అక్షరం/బయ్యారం, డిసెంబర్ 10:** మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రెస్ మీట్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం బయ్యారం మండలం బాలాజీ పేట గ్రామపంచాయతీ కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు బత్తిని రామ్మూర్తి ని గత వారం రోజుల క్రితం గ్రామ శాఖ అధ్యక్షులు కోడి శ్రీనివాస్ బత్తిని రామ్మూర్తిని మండల కాంగ్రెస్ పార్టీ నుండి సస్పెండ్ అని తప్పుడు ఆరోపణలు చేసినారు దాని విషయమై నిన్న బయ్యారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కంబాల ముసలయ్య గ్రామ పార్టీ అధ్యక్షులు ఆరోపణలను సమర్థిస్తూ పత్రిక ముఖంగా తప్పుడు ఆరోపణలు చేయడం జరిగింది దానిని నిరసిస్తూ బయ్యారం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఖరిని నిరసిస్తూ ఆరోపణలు చేసే అధికారం గ్రామ శాఖ అధ్యక్షుడికి ఎక్కడిదని దానికి వత్తాసు పలికే హక్కు ముసలయ్య గారికి లేదని ఏదైనా పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాలుపడితే జిల్లా అధ్యక్షులు భరత్ చందర్ రెడ్డి గారికి గాని గౌరవ ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య గారికి గాని తెలియజేయవలసిన బాధ్యత మండల అధ్యక్షుడికి ఉంటది జిల్లా కాంగ్రెస్ పార్టీ అనుమతితో అట్టి వ్యక్తికి షోకాజ్ నోటీసులు ఇచ్చి సదరు వ్యక్తి నుండి వివరణ కోరవలసిన బాధ్యత మండల పార్టీపై ఉంది ఆరోపణలు నిజమని తెలిస్తేనే జిల్లా పార్టీ అధ్యక్షులు అనుమతితో సస్పెండ్ చేసే అధికారం మండల పార్టీ అధ్యక్షునికి ఉంటది ఇది తెలుసుకోకుండా ఒకరిద్దరి వ్యక్తుల బిఆర్ఎస్ పార్టీకి తొత్తుగా మారి స్వార్థ ప్రయోజనాల కోసం పార్టీని భ్రష్టు పట్టిస్తున్న కంబాల ముసలయ్య ఇప్పటికైనా నీవైఖరి మార్చుకొని పార్టీ కోసం పనిచేస్తున్న వ్యక్తులపై ఇలాంటి ఆరోపణలు వెనక్కు తీసుకొని క్షమాపణ చెప్పాలని లేనియెడల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు భరత్ చంద్ర రెడ్డి మరియు ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య దృష్టికి తీసుకెళ్లి మీపై క్రమశిక్షణ చర్య తీసుకోవాలని లిబయ్యారం మండల కాంగ్రెస్ పార్టీ 29 గ్రామపంచాయతీల గ్రామ శాఖ అధ్యక్షులు కార్యదర్శులు మాజీ సర్పంచులు మాజీ ఎంపిటిసిలు మరియు మండల సీనియర్ నాయకులు తీర్మానం చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి సనప,సోమేశ్ బయ్యారం టౌన్ అధ్యక్షులు నాయిని, శ్రీనివాస్ రెడ్డి మాజీ సర్పంచ్లు పోలబోయిన, వెంకటేశ్వర్లు కారం,భాస్కర్ పూసం, రమేష్ చింత, ప్రసాద్ పర్షిక, రాజు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రావూరి, రామచంద్రయ్య ఇల్లందు ఏ బ్లాక్ ఉపాధ్యక్షులు బయ్యారం కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ అధ్యక్షులు భూక్య,రవి నాయక్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గూగులోతు, కిషన్ నాయక్ బండి,యాదగిరి గ్రామ శాఖ అధ్యక్షులు దూదిమెట్ల మోహన్ రావు డైరెక్టర్ లింగయ్య తోటి,అశోక్ బోయిన,లింగయ్య మాజీ ఉప సర్పంచ్ వీరభద్రం కాంగ్రెస్ యూత్ నాయకులు ధరావత్,నవీన్ గణేష్ మక్కు మంచా, మహేష్ కొమరయ్య కొప్పు మురళి, కాచన పల్లి గ్రామ శాఖ అధ్యక్షులు కాసం, రవి ధరావత్, శ్రీను రవి రాములు చిరంజీవి నాగేష్ సందీప్ నాను లావుడియా మురళి నవీన్ పార్టీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# నిర్దవెల్లిలో ప్రారంభమైన క్రికెట్ టోర్నమెంట్

**● పోటీలను ప్రారంభించి క్రీడాకారులను అభినందించిన మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్**




**తొలి అక్షరం/కేశంపేట, జనవరి10:** ప్రతి యేటా కేశంపేట మండలం నిర్దవెళ్ళి గ్రామంలో బీఆర్ఎస్ యువనాయకులు వై. రవీందర్ యాదవ్ సహాకారంతో నిర్వహించే క్రికెట్ టోర్నమెంట్ ను మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ శుక్రవారం ప్రారంభించారు. క్రీడల పోటీలలో పాల్గొంటున్న క్రీడాకారులను అభినందించారు. గ్రామీణ ప్రాంత క్రీడాకారులు రాష్ట్ర జాతీయ స్థాయిలో రాణించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, ఆదిశగా ప్రతి క్రీడాకారుడు కృషి చేయాలని కోరారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ క్రీడలతోపాటు చదువుల్లో ఉత్తమ ప్రతిభను చూపాలని, నేటి పోటీ ప్రపంచంలో ఏ రంగంలోనైనా రాణించాలంటే ఆ రంగంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. ముఖ్యంగా రోజు గంట సమయం పాటు నేటితరం యువత శారీరక శ్రమ, క్రీడలకు కేటాయిస్తే సంపూర్ణ ఆరోగ్యానికి పొందేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. గ్రామంలో గొప్పగా క్రీడల పోటీలో నిర్వహించడం సంతోషకరమని, నిర్వాహకుల పనితీరు అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ లక్ష్మీనారాయణ గౌడ్, మాజీ సర్పంచులు వెంకట్ రెడ్డి, నవీన్, మాజీ ఎంపీటీసీ మల్లేష్ యాదవ్, నాయకులు ప్రేమ్, జమాల్, సాజిద్, రామకృష్ణ, జగన్మోహన్ రెడ్డి, మల్లయ్య, మురళీ, వెంకటేష్, ఫైజాన్ ఖాన్, శేఖర్, సుధాకర్ మరియు ఆర్గనైజింగ్ టీం తదితరులు పాల్గొన్నారు.

# నూతన సంవత్సరం సందర్భంగా మెకానిక్ రంజిత్‌చే రావి మొక్క నాటించిన వన ప్రేమికుడు నల్లగొండ సమ్మయ్య




**తొలిఅక్షరం/నెక్కొండ, జనవరి 10:** వరంగల్ జిల్లా నెక్కొండ పట్టణ కేంద్రంలోని రాజీవ్ గాంధీ సెంటర్లో బైక్ పాయింట్ షాప్ నందు నూతన సంవత్సరం ను పురస్కరించుకొని గ్రీన్ ఇండియా ఛాలెంజ్ జీవవైవిధ్య అవార్డు గ్రహీత వన ప్రేమికుడు నల్లగొండ సమ్మయ్య, బైక్ మెకానిక్ రంజిత్ చే రావి మొక్క నాటడం జరిగింది. ఈ సందర్భంగా వన ప్రేమికుడు నల్లగొండ సమ్మయ్య మాట్లాడుతూ మానవాళి ప్రాణవాయువు జీవులకు చెట్లే జీవనాధారం అన్నారు. పర్యావరణం పరిరక్షణకు ప్రతి ఒక్కరు ప్రతి ఇంటి ఆవరణలో గాని పెరట్లో గాని మొక్కలు నాటి చెట్లను పెంచడం వల్ల మంచి వాతావరణం అందించడానికి ఉపయోగపడతాయని వన ప్రేమికుడు సమ్మయ్య వివరించి ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చారకొండ నరేష్,తాటికాయల మధు,ఊడుగుల రాంబాబు గౌడ్,అందే వేణు,దినకరన్,స్వామినాయక్ తదితరులు పాల్గొన్నారు.

# గేమ్ చేంజర్ మూవీ ఒక మంచి మేసేజ్ ఉన్న మూవీ, ప్రతి ఒక్కరు చూడదగ్గ సినిమా

**● గేమ్ చేంజర్ మూవీ రికార్డులు బద్దలు కొట్టడం కాయం**

**● అఖిల భారత చిరంజీవి యువత ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా అధ్యక్షుడు, జనసేన నాయకులు రాజు నాయక్ ● గేమ్ చేంజర్ మూవీ విడుదల సందర్భంగా షాద్ నగర్ లో మెగా అభిమానుల సంబరాలు**



**తొలి అక్షరం/షాద్ నగర్, జనవరి10:** గేమ్ చేంజర్ మూవీ ఒక్క మంచి మేసేజ్ ఉన్న మూవీ ప్రతి ఒక్కరు చూడదగ్గ సినిమా అని అఖిలభారత చిరంజీవి యువత ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా అధ్యక్షుడు, జనసేన పార్టీ నాయకుడు జరుపుల రాజు నాయక్ అన్నారు. గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ నటించిన గేమ్ చేంజర్ మూవీ విడుదల సందర్భంగా రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ లోని రామకృష్ణ థియేటర్ లో అఖిల భారత చిరంజీవి యువత ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా అధ్యక్షుడు రాజు నాయక్ ఆధ్వర్యంలో మెగా అభిమానులు, టీం రామ్ చరణ్ అభిమానులు సంబరాలు చేసుకున్నారు. బ్యాండ్ మేళం తో స్టెప్పులేస్తూ టపాసులు కాల్చి రామ్ చరణ్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా రాజు నాయక్ మాట్లాడుతూ నేటి సమాజంలో ప్రజలు డబ్బుకు లొంగకుండా మంచి నాయకున్ని ఎలా ఎన్నుకోవాలో ఈ మూవీలో స్పష్టంగా చూపించారని అన్నారు. రాజకీయ పార్టీలు డబ్బులు ఖర్చు పెట్టకుండా జీరో పాలిటిక్స్ ఎలా చేయాలో ఈ మూవీలో చూస్తే జనసేన పార్టీ, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ గుర్తుకొస్తున్నారన్నారు. అధికారులు నిజాయితీగా ఉండి పని చేస్తే ఆ పవర్ ఎలా ఉంటుందో ఈ మూవీలో చూపించారని అన్నారు. ప్రతి ఒక్కరు ఈ మూవీ చూడాలని మంచి మెసేజ్ ఉన్న మూవీ అని తెలిపారు. గేమ్ చేంజర్ మూవీ రికార్డులు బద్దలు కొట్టడం ఖాయమని దీమా వ్యక్తం చేశారు. టీం రామ్ చరణ్ షాద్ నగర్ నియోజకవర్గ అధ్యక్షుడు ఆశ్రాఫ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు గేమ్ చేంజర్ మూవీ చూస్తే ప్రజల్లో మార్పు వస్తుందని మంచి నాయకున్ని ఎలా ఎన్నుకోవాలి ఈ మూవీలో చూపించారని ఇంత మంచి సినిమా తీసినందుకు చిత్ర యూనిట్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దాసరి శ్రీశైలం శంకర్ నాయక్ పవన్ నాయక్ పరమేష్ శ్రీను సంతోష్ నాయక్ సిద్దు నాయక్ రవి చందు అఖిల్ రమేష్..అఖిల భారత చిరంజీవి యువత సంఘం నాయకులు, మెగా, టీం రామ్ చరణ్ అభిమానులు, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




# ఘనంగా మైనంపల్లి హనుమంతరావు జన్మదిన వేడుకలు




**తొలి అక్షరం/పాపన్నపేట జనవరి 10:** పవిత్ర పుణ్యక్షేత్రమైన ఏడుపాయల్లో శుక్రవారం మెదక్ మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు జన్మదిన వేడుకలను కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. మొదట ఆయన పేరు మీద దుర్గమ్మ తల్లికి అర్చన చేయించారు. అనంతరం రాజగోపురం ముందు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు గోవింద్ నాయక్, జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి శ్రీకాంత్ అప్ప, మాజీ జెడ్పిటిసి మల్లప్ప, ఏడుపాయల మాజీ చైర్మన్లు వెంకటేశ్వర్ రెడ్డి,బ్లాక్ కాంగ్రెస్ యువజన సంఘ అధ్యక్షులు భరత్ గౌడ్,కిసాన్ సెల్ నాయకులు శ్రీకాంత్ రెడ్డి, మాజీ కోఆప్షన్ సభ్యులు గౌస్, మాజీ ఎంపీటీసీ ఆకుల శ్రీనివాస్, రాము, బాబర్ పటేల్, మల్ సాబ్, సంతోష్ రెడ్డి, జంగం సతీష్,ప్రేమ్ కుమార్, రాజు, చోటు, శంకర్, మంగలి లక్ష్మణ్, కుమ్మరి విట్టల్, మెదక్ పాపన్నపేట మండలాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు

# ముందస్తుగా ఆర్డిఎఫ్ రెడ్లవాడ పాఠశాలలో సంక్రాంతి రంగవల్లులు



**తొలిఅక్షరం/నెక్కొండ, జనవరి 10:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల పరిధిలోని రెడ్లవాడ ఆర్ డి ఎఫ్ పాఠశాలలో సంక్రాంతి సంబరాలలో భాగంగా పాఠశాల ప్రాంగణంలో ముగ్గుల పోటీలు నిర్వహించడం జరిగింది. విద్యార్థినిలు మరియు ఉపాధ్యాయినిలు సంక్రాంతి సంబరాలలో భాగంగా రంగవల్లులను తీర్చిదిద్దడం జరిగింది, పాఠశాలలోని సంస్కృతి సాంప్రదాయాలు కళలకు అద్దం పట్టే విధంగా విద్యార్థినిల యొక్క మూర్తిమత్వాన్ని, సృజనాత్మకతను వెలికి తీసే క్రమంలో విద్యార్థులతో ఉపాధ్యాయులు మమేకమై ఆనందంగా పాల్గొని సంక్రాంతి పర్వదిన సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించేలా ముగ్గులను హరివిల్లుల రంగులతో వేసి అబ్బురపరిచారు. భాగంగా పాఠశాల ప్రధానాచార్యులు శ్రీ సి.హెచ్. చేరాలు ,ఇన్చార్జులు రవి, రాజు, ఉపాధ్యాయ బృందం పాఠశాల విద్యార్థిని విద్యార్థులు పాల్గొని ఆనందించారు.

# నూతన మండల అధ్యక్షులను జిల్లా కౌన్సిలర్ మెంబర్స్‌ను సత్కరించిన గోగుల రాణా ప్రతాప్ రెడ్డి

**తొలి అక్షరం/నర్సంపేట, జనవరి 10:** నర్సంపేట పట్టణ కేంద్రంలోని. స్థానిక బిజెపి పార్టీ కార్యాలయంలో నూతనంగా నియమించబడిన మండల అధ్యక్షులు మరియు జిల్లా కౌన్సిల్ మెంబర్ లను సత్కరించిన జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణా ప్రతాపరెడ్డి రెడ్డి నర్సంపేట నియోజవర్గం లో సంఘటన పర్వ్ -2024 లో భాగంగా నూతనంగా ఎన్నికైన బిజెపి నర్సంపేట పట్టణ అధ్యక్షుడు గూడూరు సందీప్ మరియు ఖానాపురం మండల అధ్యక్షులు రాధరపు అశోక్ అలాగే నూతనంగా నియమించబడిన జిల్లా కౌన్సిల్ మెంబర్ పొదిల్ల రామచందర్ మరియు జిల్లి మధు మర్యాద పూర్వకంగా జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి ని కలవడం జరిగింది.అనంతరం రాణా ప్రతాప్ రెడ్డి వారికి శాలువ కప్పి శుభాకాంక్షలు తెలియచేయం జరిగింది.



# వేల కట్టలేని ప్రేమ "తల్లిప్రేమ"

- మండల విద్యాశాఖ అధికారి రాందాసు..
- ఆకట్టుకున్న మాతృ వందనం అమ్మ దీవెన..
- పాఠశాల ప్రధానోపాధ్యాయులు
- సాయిలు,ఉపాధ్యాయులపై ప్రశంసల జల్లులు..
- శ్రీరామగిరిలో ఉన్నత పాఠశాలపై దృష్టి సారించాలి..







**తొలి అక్షరం/నెల్లికుదురు,జనవరి10:** ప్రపంచంలో అమ్మ ప్రేమకు వేల కట్టలేనిది "తల్లి ప్రేమ"అని మండల విద్యాశాఖ అధికారి రామదాసు అన్నారు. నెల్లికుదురు మండలం శ్రీరామగిరి ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం"మాతృ వందనం అమ్మ దీవెన అనే కార్యక్రమంలో గ్రామస్తులు,విద్యార్థినీ విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ప్రధానోపాధ్యాయులు బి. సాయిల్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా ఎంఈఓ రామదాసు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ, అతిథులుగాపాఠశాల చైర్మన్ రజిత, ఉపాధ్యాయుల సమక్షంలో, నిర్వహణలో ఈ కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించడం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన రామదాసు ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాలలో విద్యతో పాటు సంస్కారంమంతమైన కార్యక్రమాలు నిర్వహిస్తు న్నందుకు ప్రధానో పాధ్యాయులతో పాటు ఉపాధ్యాయ బృందాన్ని అభినందించినారు. విద్యార్థులు చదువు పట్ల శ్రద్ధ వహించా లంటూ చదువుతోపాటు సంస్కారం కూడా నేర్చుకోవాలని చెబుతూ ఈ విషయంలో తల్లుల ప్రోత్సాహం చాలా అవసరం అని అన్నారు. పిల్లలకు పరిశుభ్రత అలవాటు చేస్తూ సరియైన సమయానికి పాఠశాలకు పంపించాలని సూచించారు. పిల్లలకు ఇప్పటినుండి పెద్దలను గౌరవించడం పెద్దలకు రెండు చేతులు జోడించి నమస్కారించడం అలవాటు చేసినట్లయితే ఆ సంస్కారం భవిష్యత్తులో వారికి అలవాటై తల్లిదండ్రులను కూడా గౌరవించే సంప్రదాయం కొనసాగుతుందని అన్నారు. మా ప్రభుత్వ పాఠశాలలు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంలో చాలా కృషి చేయడం జరుగుతుందన్నారు. ప్రైవేటు పాఠశాలలకు పంపించకుండా మీతో పాటు మీ పరిసర ప్రాంతాల పిల్లలు కూడా మా ప్రభుత్వ పాఠశాలకు పంపిం చెందుకు కృషి చేయా లన్నారు.

**దేవుడి రూపంలో ఉన్న అమ్మను సృష్టించడం అదృష్టవంతులం: అంబేద్కర్ ఫెలో షిప్ అవార్డు గ్రహీత డాక్టర్ ఆదూరి కళాధర్ రాజు..** పాఠశాల విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ డాక్టర్ ఆదూరి కళాధర్ రాజు ,దేవుడు ప్రతి ఇంట్లో ఉండలేక అమ్మను సృష్టించి మనకు అందజేశారని అటువంటి దైవ సమాను రాలైన అమ్మను పూజించటం చాలా మంచిదని ఆ తల్లులను పూజించే కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించిన ప్రధానో పాధ్యాయులను అభి నందించారు. పాఠశాల చైర్మన్ రజిత మాట్లాడుతూ పాఠశాలకు వసతులు సక్రమంగా ఏర్పాటు చేస్తున్నామని పిల్లల పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారన్నారు. అనంతరం మాతృ వందన కార్యక్రమంలో విద్యార్థుల తల్లులంద రినీ ఒకే వేదిక మీద కూర్చోబెట్టివారి పిల్లలందరితో పాదాలపై పూలు చల్లించి పాదప్రక్షాళన గావించి మెడలో పూల దండలు వేసి తాంబూలాలు అందించి పాదాభివందనం చేయగా తల్లులు పిల్లల తలపై అక్షంతలు వేసి ఆశీర్వదించి ఆలింగనం చేసుకున్నారు. ఈ సందర్భంగా కొంతమంది తల్లులు భావో ద్వేగానికి గురి కాగా కళ్ళల్లో ఆనంద భాష్పాలు కనిపించాయి. చాలా సంవత్సరాల తర్వాత పాఠశాల ఒక కళగా కనిపించడంతో విద్యార్థుల తల్లిదండ్రులతోపాటు గ్రామస్తులు కూడా ఆనందపడ్డారు. అనంతరం ముగ్గుల పోటీ నిర్వహించగా పాల్గొన్న వారికి మొదటి రెండవ బహుమతులుగా పట్టుచీరలు గొల్లపల్లి రజిత పాఠశాల చైర్మన్ అందించారు. పాల్గొన్న మహిళ లందరికీ గుగ్రాల నరేష్ తన కుమారుడు త్రిశాంత్ సంస్మరణ గా బహుమతులు అందించారు. ప్రధానోపాధ్యాయులు అధ్యక్ష ఉపన్యాసం ఇస్తూ పాఠశాలకు ఇంకా కొన్ని మౌలిక వసతులు అవసరం ఉన్నాయని ఇందుకు గ్రామస్తుల సహకారం కూడా చాలా అవసరమని ప్రస్తుతం అందిస్తున్న సహకారాన్ని భవిష్యత్తులో ఇలాగే కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు యాదగిరి,విలియమ్స్, భాగ్యమ్మ,కవిత, శ్రీనివాస్, సుధాకర్,మాధురి,పాల్గొన్నారు.

## మండల కేంద్రంలో వైభవంగా ముక్కోటి ఏకాదశి వేడుకలు


- ఉత్తర ద్వారంలో భక్తులకు దర్శనం తిలకించి తరించిన భక్తజనం • వైకుంఠ భక్తులకు అనుగ్రహం • లక్ష్మీ నరసింహా స్వామి ఆలయంలో స్మరణలతో మారు మోగిన



**తొలి అక్షరం/నరసింహుల పేట జనవరి 10:** మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శుక్రవారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వారం ద్వారా భక్తులకు దర్శనమిచ్చారు. వేదపండితులు ముక్కోటి విశిష్టతను వివరించారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు వేడుకను తిలకించారు. భక్తులకు ముక్కోటి ఏకాదశి విశిష్టతను వివరించారు. అర్చకులు 108 ఒత్తులతో వెలిగించిన హారతినికి భక్తులు అందుకున్నారు. ఉత్తర ద్వారం ద్వారా దర్శనం తర్వాత ఉత్సవ మూర్తులను మాడ వీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆలయా అర్చకులు శ్రీనివాసచార్యులు. మండల పార్టీ అధ్యక్షులు రమేష్. గ్రామ పార్టీ అధ్యక్షులు రామకృష్ణతోపాటు భక్తులు తదితరులు పాల్గొన్నారు

## వైకుంఠ ఏకాదశి సందర్భంగా శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో పూజ కార్యక్రమాలు

- ప్రత్యేక పూజలతో పీసీసీ సభ్యులు పెండెం రామానంద్



**తొలిఅక్షరం/నర్సంపేట, జనవరి 10:** నర్సంపేట పట్టణంలోని స్థానిక శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్న టీపీసీసీ సభ్యులు పెండెం రామానంద్,వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రతి ఒక్కరిపై ఆ వైకుంఠ వాసుడు దివ్య ఆశీస్సులు ఉండాలని ప్రార్థిస్తూ నర్సంపేట వెంకటేశ్వర స్వామి వారిని ఆలయంలో దర్శించుకుని ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించిన టీపీసీసీ సభ్యులు పెండెం రామానంద్ ఈ కార్యక్రమంలో నర్సంపేట నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు తుమ్మలపెల్లి సందీప్, నర్సంపేట నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు ములుకల మనీష్,కాంగ్రెస్ పార్టీ నాయకులు దేవండ్ల రాంబాబు, తదితరులు పాల్గొన్నారు

## ముక్కోటి ఏకాదశి సందర్భంగాశ్రీ గోదా రంగనాథ స్వామిని దర్శించుకున్న రంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు

**తొలి అక్షరం/షాద్ నగర్, జనవరి10:** మొగిలిగిద్దలో ప్రసిద్ధిగాంచిన శ్రీ గోదా రంగనాథ స్వామినీ ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా దర్శించు కొనీ ప్రత్యేక పూజలు నిర్వహించడం పురోహితుల ఆశీర్వచనం తీసుకోవడం జరిగింది ముక్కోటి ఏకాదశి రోజున వైకుంఠ ద్వార దర్శనం ఎన్నో జన్మలో పుణ్యమని ఈ సందర్భంగా గందే సురేష్ మాట్లాడడం జరిగింది. ఈ సందర్భంగా నూతనంగా అధ్యక్షునిగా ఎన్నికైన గందే సురేష్ గారిని అన్మారి మురళి సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఫరూక్ నగర్ మండల మాజీ అనుమారి మురళి,నీల రవీందర్, మల్లిపెద్ది శ్రీనివాస్, పసుపుల రాజేందర్,ఆలయ పూజారులు తదితరులు పాల్గొన్నారు.



## మండల కేంద్రంలో వైభవంగా ముక్కోటి ఏకాదశి వేడుకలు

- ఉత్తర ద్వారంలో భక్తులకు దర్శనం తిలకించి తరించిన భక్తజనం.
- వెంకటేశ్వర స్వామి ఆలయంలో స్మరణలతో మారు మోగిన





**తొలి అక్షరం/పాపన్నపేట జనవరి 10:** ముక్కోటి ఏకాదశి నీ పురస్కరించుకొని వెంకటేశ్వర స్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. గురువారం ఉదయం నుండే భక్తులు ఉత్తర ద్వారా దర్శనం చేసుకునేందుకు వెంకటేశ్వర స్వామి ఆలయాలకు చేరుకొని స్వామి వారి నీ దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రమైన పాపన్న పేట తో పాటు మల్లంపేట, లక్ష్మీనగర్, అన్నారం, నాగ్సాన్ పల్లి, నార్సింగి గ్రామాల్లో నీ వెంకటేశ్వర స్వామి ఆలయాలు భక్తులు పెద్దా సంఖ్యలో తరలి వచ్చి స్వామి వారి నీ దర్శించుకున్నారు. మల్లంపేటలో తొగిట పిఠాధిపతి మాధవానంద స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు, ఇది ఇలా ఉండగా అన్ని ప్రాంతాల్లో భక్తులు అదిక సంఖ్యలో తరలి రావడంతో ఆలయ నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేశారు.

## మాంటిసోరి హైస్కూల్‌లో సంక్రాంతి ముగ్గుల సంబర పోటీలు

- ముఖ్య అతిథిలుగా డైరెక్టర్లు ఎర్ర ఊర్మిల,కుంభం రజిని పాపిరెడ్డి



**తొలిఅక్షరం/నర్సంపేట, జనవరి10:** నర్సంపేట పట్టణంలోని స్థానిక మాంటిసోరి పాఠశాలలో సంక్రాంతి ముగ్గుల పోటీలను ప్రధాన అధ్యాపకులు కుంభం రాజ పాపిరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు,ఉపాధ్యాయుని ఉపాధ్యాయులుపాఠశాల తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా డైరెక్టర్ కుంభం రజిని పాపిరెడ్డి మాట్లాడుతూ...సంక్రాంతి పండుగ అంటే సకల భోగ భాగ్యాలను అందించే పండగని అత్యంత వైభోగంగా మరియు ఘనంగా నిర్వహించుకుని సంతోషంగా ఉండాలని మా పాఠశాల తల్లిదండ్రులకు,ఉపాధ్యాయుని ఉపాధ్యాయులకు, విద్యార్థులు అందరికీ ముందుగా సంక్రాంతి శుభాకాంక్షలు తెలియ జేస్తున్నామన్నారు అదేవిధంగా పాఠశాల ప్రాంగణంలోముగ్గుల పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినిలకు డైరెక్టర్ ఎర్ర ఊర్మిళచే ప్రత్యేక బహుమతులను అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో ఉపాధ్యాయుని,ఉపాధ్యాయుల బృందం పాల్గొన్నారు.

## విద్యార్థులు విద్యతో పాటు సంస్కృతిక రంగాలలో రాణించాలి

- యువజన ఉత్సవాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించిన ఎస్సై చిర్ర రమేష్ బాబు..




**తొలి అక్షరం/నెల్లికుదురు,జనవరి 10:** విద్యార్థులు విద్యతోపాటు సంస్కృతిక రంగాల్లో రాణించాలని ఎస్సై చిర్ర రమేష్ బాబు అన్నారు. నెల్లికుదురు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు కాకతీయ యూనివర్సిటీ జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో వాగ్దేవి డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో గురువారం జరిగిన ఉమ్మడి వరంగల్ స్థాయిలో యువజన ఉత్సవాలు నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రోగ్రాం ఆఫీసర్ అనిల్ కుమార్ ఆధ్వర్యంలో వాలంటీర్లు పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరిచి కాకతీయ యూనివర్సిటీ వైస్ ఛాన్సర్ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణ ల చేతుల మీదుగా బహుమతులతో పాటు ప్రశంసలను అందుకున్నారు. జూనియర్ విభాగంలో దేశభక్తి గేయ రచనలో ప్రథమ బహుమతి జి. మాధవి, డిబెట్ లో బి. నవీన్, జి. అనిత, సోలో సాంగ్ విభాగంలో పి.యశ్వంత్ ద్వితీయ బహుమతి, పోస్టర్ పెయింటింగ్ లో సి హెచ్. నరేందర్, గ్రూప్ డ్యాన్స్ లో వైష్ణవి, సభిల, కావ్యశ్రీ, సుస్మిత, శృతి, కల్పన లు తృతీయ బహుమతి, ఎగ్జిబిషన్ లో శ్రావణి, నవ్య, సోమ్మన్న లు ప్రథమ బహుమతిని అందుకున్నారు. బహుమతులు అందుకున్న విజేతలను శుక్రవారం స్థానిక కళాశాలలో నిర్వహించి ప్రశంసలు అభినందన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక ఎస్సై చిర్ర రమేష్ బాబు పాల్గొని మాట్లాడుతూ, విద్యార్థులు చదువులతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలలో ప్రతిభ కనపర్చాలని వాలంటీర్లకు సూచించారు. అధ్యాపకులు చెప్పే విషయాలను జాగ్రత్తగా విని వాటిని వైఫల్యం లేకుండా ఆచరణలో పెట్టాలన్నారు. త్వరలో జరిగే యూనివర్సిటీ స్థాయి పోటీలలో ప్రతిభ కనబరిచి కళాశాలకు నెల్లికుదురు మండలానికి కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. పరీక్షలు దగ్గర ఉండడంతో విద్యార్థులు క్షణికావేశానికి లోనుకాకుండా ఆత్మస్థైర్యంతో పాఠ్యాంశాలను అభ్యసించాలని కోరారు. ఉమ్మడి వరంగల్ స్థాయిలో జరిగిన యువజన ఉత్సవాలలో బహుమతులు గెలుపొందిన వాలంటీర్లను, ప్రోగ్రాం ఆఫీసర్ మర్సకట్ల అనిల్ కుమార్, అధ్యాపకులు మహేందర్ ను ఇన్చార్జి ప్రిన్సిపల్ అధ్యాపక బృందం ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపల్ బండి శ్రీనివాస్ ,కవిరాజ్ ,మహేందర్, నాగేశ్వర రావు, వెంకటేశ్వర్లు, యాకన్న ,సతీషు బాబు, సుధాకర్, రామ్మూర్తి, సుభాష్, శ్రీనివాస్, గౌరీ శంకర్, లక్ష్మణ్, ప్రదీప్, సైదా ,తదితరులు పాల్గొన్నారు.




## మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

- ఎఫ్.ఎం.ఎం. సంఘీక సేవా సంస్థ వరంగల్ డైరెక్టర్ సిస్టర్ సహాయ

**తొలిఅక్షరం/నెక్కొండ,జనవరి10:** మండల కేంద్రంలోని అంబేద్కర్ భవవనంలో శ్రీ ధరణి స్వచ్ఛంద సేవా సంస్థ కో ఆర్డినేటర్ ఈదునూరి రమేష్ అధ్యక్షతన ఎఫ్.ఎం.ఎం సంఘీక సేవా సంస్థ సహకారంతో నెక్కొండ మండల నిరుపేద మహిళలకు మగ్గం వర్క్ పైన ఉచితంగా ఇచ్చు శిక్షణ కేంద్ర ప్రారంబోత్సవ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యమానికి ముఖ్య అతిధులుగా ఎఫ్.ఎం.ఎం సంఘీక సేవా సంస్థ వరంగల్ డైరెక్టర్ సిస్టర్ సహాయ గారు విచ్చేసారు. ప్రారంభోత్సవ కార్యక్రమం అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమే మాట్లాడుతు నెక్కొండ మండల మహిళలకు శుభాకాంక్షలు ముఖ్యంగ ఇట్టి మగ్గం వర్క్ శిక్షణ 45 రోజుల పాటు ఉంటుంది కాబట్టి ఈ యొక్క శిక్షణను ప్రతిఒక్కరు కాల వ్యవదిలో ఏకగ్రతతో శ్రద్దగా నేర్చుకొని అనంతరం ప్రస్తుత కాలంలో మార్కెట్ లో డిమాండ్ ఉన్న మగ్గం వర్క్ పైన స్వయంగ ఉపాధి ఏర్పాటు చేసుకొని ఆర్థికంగా ఎదగాలని, ఆత్మగౌరవంతో జీవించాలని, మహిళా సాధికారత సాధించి మిగతా మహిళా లోకానికి ఆదర్శంగ నిలవాలని ఆమే కోరారు. సొంతంగ లేదంటే ఒక గ్రూపుగా ఏర్పాటు అయి ఒక కుటీర పరిశ్రమను ఏర్పాటు చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి ఎన్నో మార్గాలు ఉన్నాయి. మేము ఇచ్చే నలభై ఐదు రోజుల పాటు శిక్షణ అనంతరం ప్రతి సభ్యురాలికి విలువైన సర్టిఫికెట్ ఇవ్వడంతో పాటు ఉపాధి మార్గాలు చూపుతామని ఆమే అన్నారు. ఈ కార్యక్రమంలో మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు మార్త లావణ్య, ఎఫ్. ఎం. ఎం. సంఘీక సేవా సంస్థ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ ఎర్ర శ్రీకాంత్, ఫైనాన్స్ మేనేజర్ ఎ. అజయ్ కుమార్, ట్రైనర్ రజిత, ఎస్.ఎచ్.జి ప్రతినిధులు నాగజ్యోతి, పూజశ్రీ, కళ్యాణి మరియు శిక్షణ పొందు మహిళలు పాల్గొన్నారు.

